ఈనాడు
అన్నమయ్య
మంగళవారం అక్టోబరు 22, 2024

ఇసుక... మంచి కాలమే ఇక!

-ఈనాడు, కడప, న్యూస్‌టుడే, రామాపురం

- సీఎం నిర్ణయంతో హర్షాతిరేకాలు
- గ్రామగ్రామాన ప్రశంసల వెల్లువ
- అక్రమార్కుల నోట్లో వెలక్కాయ

ఇసుక ఉచితంగా దొరుకుతున్న రోజులవి. సమీప వాగులు, వంకలు, నదుల నుంచి అవసరానికి తెచ్చుకుని వాడుకుంటున్న పరిస్థితి. ఎలాంటి షరతుల్లేకుండా నాణ్యమైన ఇసుకను తెచ్చుకునే పరిస్థితిని వైకాపా అధికారంలోకి వచ్చాక కష్టకాలంలోకి నెట్టేసింది. ఇసుకను బంగారంగా మార్చేసింది. పంట పొలాల పక్కనున్న ఇసుకను సైతం ముట్టుకునే పరిస్థితి లేకుండా చేసేసింది. మన దగ్గరే ఇసుక ఉన్నా కొనుక్కోవాల్సిన దుస్థితిలోకి తీసుకెళ్లింది. ఈ వ్యవహారంలో గత అయిదేళ్లుగా ఎన్నో అరాచకాలు చోటుచేసుకున్నాయి. నేరాలు.. ఘోరాలు జరిగాయి. పాత రోజులను నెమరువేసుకోవడం మినహా ఏమీ చేయలేని పరిస్థితి నెలకొంది. ఈ పరిస్థితిలో ఇసుకే వైకాపా ప్రభుత్వ పునాదులను పెకలించింది. ఎన్డీయే సర్కారు అధికారంలోకి వచ్చిన అనంతరం ఉచిత ఇసుక విధానం తీసుకొచ్చినా అక్కడక్కడా లోపాలు.. అక్రమాలు దొర్లాయి. దీనిపైనా పెదవి విరుస్తున్న సమయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తాజాగా తీసుకున్న నిర్ణయాలతో ప్రజలు సంబర పడుతున్నారు. మరోవైపు కూలీలకు ఉపాధి దొరుకుతోంది.

● రేవుల నుంచి సొంత అవసరాలకు ఇసుకను ఉచితంగానే ట్రాక్టర్లతో తీసుకెళ్లేందుకు అనుమతి ఇస్తూ ఎన్డీయే ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. ఉచిత ఇసుకపై సవరణ నిర్ణయాన్ని ఇటీవల జరిగిన తెదేపా ప్రజా ప్రతినిధుల భేటీలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రకటించి వెంటనే ఆచరణలోకి తీసుకొచ్చారు. దీంతో గత మూడు రోజులుగా అన్నమయ్య, వైఎస్ఆర్ జిల్లాల్లో నెలకొన్న పరిస్థితుల్లో భారీ మార్పులు చోటుచేసుకున్నాయి. తాజా నిర్ణయాలతో అక్రమార్కులు నోట్లో వెలక్కాయ పడినట్లయింది. ఉచిత ఇసుక విధానం వచ్చాక సైతం కొన్ని ప్రాంతాల్లో నేతలు తమ గుప్పిట్లో రేవుల్ని పెట్టుకుని టిప్పర్ల వంతున వసూళ్లకు పాల్పడ్డారు. వాహనాలకు ఇసుక నింపడంలోనూ పైరవీలు జరిగాయి. పేరుకే ఉచిత ఇసుక అంటున్నారని, వసూళ్లకు పాల్పడుతున్నారంటూ విమర్శలు వినిపించాయి. ఈ తరుణంలో బేషరతుగా రేవుల్లో నుంచి ఉచితంగా తీసుకెళ్లే విధానాన్ని ఎన్డీయే ప్రభుత్వం తీసుకొచ్చి ఆచరణలో పెట్టింది. దీంతో రెండు జిల్లాల్లోనూ ఇసుక పరంగా ఎలాంటి అక్రమాల్లేకుండా పోయాయి. వినియోగదారులు వాగులు, వంకలు, నదుల నుంచి ఇసుక తీసుకెళుతున్నారు. ప్రత్యేకించి ఇళ్లు నిర్మించుకుంటున్న పేదలు ఎలాంటి షరతుల్లేకుండా ఇసుకను వినియోగించుకుంటున్నారు. కూలీలు సైతం ఇసుక నింపడానికి వెళ్తూ ఉపాధి పొందుతున్నామనే ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా అధికలోడు పేరిట జరిమానాలు విధించడానికి చెల్లుచీటి పలికారు.

చాలా ఉపశమనం

ఎన్డీయే ప్రభుత్వ నిర్ణయంతో ఇసుక ట్రాక్టర్ల యజమానులు, వినియోగదారులు ఉపశమనం పొందారు. దాడుల పేరిట వాహనాలను పట్టుకోవడం, అక్రమ వసూళ్లకు పాల్పడడం జరిగింది. వీటన్నింటికీ మంగళం పలుకుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయాలు తీసుకోవడం, ఆచరణలో పెట్టడం జరిగిపోయింది.

సరిహద్దుల్లో చెక్‌పోస్టుల అవశ్యం

ఇరు జిల్లాల నుంచి బెంగళూరు, హైదరాబాద్‌కు ఇసుక తరలిపోకుండా సరిహద్దుల్లో పటిష్ఠంగా చెక్‌పోస్టులు ఏర్పాటు చేయాల్సి ఉంది. అన్ని రకాలుగా ఉచిత అనుమతుల ముసుగులో పొరుగు రాష్ట్రాలకు ఇసుక తరలిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంది. ఇక్కడి ఇసుక నాణ్యతగా ఉండడంతో పొరుగు జిల్లాలు, రాష్ట్రాల్లో మంచి గిరాకీ ఉంటోంది. జిల్లా వినియోగదారులకు తప్ప ఇతర ప్రాంతాలకు తరలిపోకుండా కట్టడి చేయాల్సిన అవసరం ఉంది.



రామాపురం మండలం ముద్దిరేవుల వంక నుంచి ఇసుక తీసుకెళ్తున్న గృహ నిర్మాణ లబ్ధిదారులు

అక్రమాలు జరిగితే సహించం



ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని పోలీసు, రెవెన్యూశాఖలు గౌరవించాలి. ఏదైనా అక్రమాలకు ఆస్కారం ఇచ్చే పక్షంలో ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళతాం. వంకలు, వాగులు, నదుల నుంచి ఇసుక తీసుకెళ్తే పట్టించుకోవద్దు. అడ్డంకులు సృష్టించే అధికారులపై చర్యలు తీసుకుంటాం.

-శ్రీనివాసరెడ్డి, తెదేపా పొలిట్‌బ్యూరో సభ్యుడు

గత ప్రభుత్వంలో ఇబ్బందులు పడ్డాం



వైకాపా ప్రభుత్వ హయాంలో ఇసుక కోసం తీవ్ర ఇబ్బందులు పడ్డాం. ప్రస్తుతం ఎన్డీయే ప్రభుత్వంలో ఉచితంగా ఇసుకను తీసుకెళుతున్నాం. కుటుంబ సభ్యులమే ట్రాక్టర్‌కు నింపుకొని తరలించుకుంటున్నాం.

-తులసమ్మ, లక్కిరెడ్డిపల్లె

వేధింపులు అధికంగా ఉండేవి



ఇసుక విషయంలో గతంలో అధికారుల నుంచి వేధింపులు అధికంగా ఉండేవి. ప్రస్తుతం ఎవరూ అడగడంలేదు. వంక నుంచి ఉచితంగా ఇంటికి తీసుకెళుతున్నాం. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడికి రుణపడి ఉంటాం.

-వెంకటరమణ, చిట్లూరు, రామాపురం మండలం

రోడ్డు ప్రమాదంలో నలుగురు దుర్మరణం!

- బంధువు అంత్యక్రియలకు వెళ్లి వస్తూ మృత్యుఒడికి
- కలకడ సమీపంలో ఆటోను ఢీకొన్న ప్రైవేటు బస్సు



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన ఆటో



ఘటనా స్థలంలో మృతదేహాలు



తీవ్రంగా గాయపడిన తల్లీకుమార్తెలు దిల్‌షాద్, తారా

కలకడ, న్యూస్‌టుడే: బంధువు అంత్యక్రియలకు హాజరై తిరిగి ఆటోలో ఇంటికొస్తుండగా వారిని ప్రైవేటు ట్రావెల్స్ బస్సు రూపంలో మృత్యువు కబళించింది. కడప-చిత్తూరు జాతీయ రహదారిలోని కలకడ సమీపంలో సోమవారం రాత్రి ఆటోను ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో నలుగురు దుర్మరణం చెందగా, ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... సంబేపల్లె మండలం రౌతుకుంట వంగిమళ్లవాండ్లపల్లెలో పీరాంబీ అనే మహిళ మృతిచెందారు. ఈమె అంత్యక్రియల్లో పాల్గొనేందుకు కలికిరి మండలం చంద్రావారిపల్లె పంచాయతీ దూదేకులపల్లెకు చెందిన ఆమె బంధువులు సోమవారం ఆటోలో బయల్దేరి వెళ్లారు. కార్యక్రమం అనంతరం ఇంటికి తిరిగొస్తుండగా కలకడ సమీపంలోని ఇందిరమ్మ కాలనీ సమీపంలోకి రాగానే చిత్తూరు నుంచి హైదరాబాద్ వెళ్తున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఎదురుగా వేగంగా వస్తూ బలంగా ఢీకొంది. ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న ఫకీర్‌బీ (55), బుజ్జమ్మ (50), ఖాదర్‌వలీ (35), చిత్తూరు జిల్లా సోమల మండలం నెల్లిమందకు చెందిన ఆటో డ్రైవరు నూరుల్లా (36) దుర్మరణంపాలయ్యారు. యాసానుల్లా (45), తల్లీకుమార్తెలు దిల్‌షాద్ (25), తారా(4) తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న రాయచోటి డీఎస్పీ కృష్ణమోహన్, కలకడ సీఐ గంగాధర్, ఎస్.ఐ. రామాంజనేయులు సిబ్బందితో ఘటనాస్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను '108'లో పీలేరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కలకడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జలసోయగం!

ఇటీవల కురిసిన భారీ వర్షాలతో ప్రముఖ పర్యాటక ప్రాంతమైన గండికోట మరింత శోభను సంతరించుకుంది. గండికోట చుట్టూ ఉన్న పచ్చని కొండల నుంచి తెల్లటి నురుగుతో పాలధార వలే జలాలు కిందకు దూకుతుండడం పర్యాటకులను కనువిందు చేస్తోంది. మైలవరం జలాశయంలోకి నిండుగా నీరు చేరడంతో రెండు కొండల నడుమ పెన్నాలోయకు మరింత అందం చేకూరింది. జలపాత సోయగాలు కనువిందు చేస్తుండడంతో పలువురు చరవాణిలో దృశ్యాలను బంధిస్తూ ఆహ్లాదకరంగా గడుపుతున్నారు. -న్యూస్‌టుడే, జమ్మలమడుగు గ్రామీణ




గండికోట లోగో, ట్యాగ్‌లైన్ అధికారిక ప్రకటన

ప్రముఖ పర్యాటక కేంద్రమైన గండికోట వారసత్వం, సంస్కృతిని ప్రతిబింబించే విధంగా సృజనాత్మకమైన లోగో, ట్యాగ్‌లైన్‌ను ఇన్‌ఛార్జి కలెక్టర్ అదితిసింగ్ సోమవారం అధికారికంగా ప్రకటించినట్లు జిల్లా పర్యాటక, సాంస్కృతికశాఖ అధికారి సురేష్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా లోగో డిజైన్ పోటీల్లో గెలుపొందిన తుషార్ శివాంకర్‌ను అభినందించినట్లు తెలిపారు. విజేత మహారాష్ట్రకు చెందిన వ్యక్తి అని, ఇన్‌స్టాగ్రామ్ ఫాలోవర్ అని, లోగో అవార్డు ప్రైజ్‌మనీ రూ.25 వేలు త్వరలో అందజేస్తామన్నారు. ఈ ప్రయత్నం గండికోటలో పర్యాటక రంగాన్ని పెంచడం కోసమేనని తెలిపారు. -న్యూస్‌టుడే, జమ్మలమడుగు

GANDIKOTA
The Grand Canyon of India

ఎన్నాళ్లో వేచిన ఉదయం



- తీరనున్న నిరుద్యోగుల ఆకాంక్ష
- 3న డీఎస్సీ నోటిఫికేషన్‌కి ప్రభుత్వ కసరత్తు

రాష్ట్రంలో ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి ఎన్డీయే ప్రభుత్వం వడివడిగా అడుగులేస్తోంది. నిరుద్యోగుల కలలను సాకారం చేసేందుకు తాజాగా కీలక నిర్ణయం తీసుకుంది. వచ్చే నెల 3వ తేదీన డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని కసరత్తు చేస్తోంది. ప్రస్తుతం టెట్ కొనసాగుతుండగా, వచ్చే నెల 2వ తేదీకి వాటి ఫలితాలు విడుదల చేసేవిధంగా కార్యాచరణ రూపొందిస్తోంది. మొత్తంగా నవంబరు 3న షెడ్యూలు విడుదల చేసేందుకు పాఠశాల విద్యాశాఖ కసరత్తు చేస్తోంది.

-న్యూస్‌టుడే, కడప విద్య

రాష్ట్రంలో 16,347 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి చర్యలు తీసుకుంటామని ప్రకటించిన ఎన్డీయే ప్రభుత్వం మెగా డీఎస్సీ నిర్వహించేందుకు జూన్ 23వ తేదీన ఆమోదించింది. ఉమ్మడి కడప జిల్లాలో సుమారు 50 వేల మంది నిరుద్యోగులు డీఎస్సీ ప్రకటన కోసం వేయికళ్లతో వేచిచూస్తున్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చేసిన తొలి అయిదు సంతకాల్లో మెగా డీఎస్సీ ఉండడం, పోస్టుల భర్తీకి చర్యలు తీసుకుంటుండటంతో ఇప్పటికే జిల్లావ్యాప్తంగా పలు శిక్షణ కేంద్రాల్లో నిరుద్యోగులు తర్ఫీదు పొందుతూ సన్నద్ధమవుతున్నారు. గతంలో తెలుగుదేశం ప్రభుత్వ హయాంలోనే డీఎస్సీ నిర్వహించగా, తిరిగి తెదేపా భాగస్వామ్య ఎన్డీయే ప్రభుత్వ హయాంలోనే డీఎస్సీ ప్రకటన వెలువడనుంది.

● ఏటా జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని చెప్పిన గత వైకాపా ప్రభుత్వ మాటలు నీటిమూటలయ్యాయి. వివిధ జీవోల అమలు పేరుతో ఉన్న పోస్టులను సైతం రద్దు చేసింది. నిరుద్యోగులు రోడ్డెక్కి ఆందోళనలు, ధర్నాలు చేసినా ఏ మాత్రం పట్టించుకోలేదు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ డీఎస్సీ అంటూ నాటకానికి తెరలేపి హడావుడిగా 6,100 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఎన్నికల కోడ్ రావడంతో పరీక్ష వాయిదా పడింది. మొత్తంగా గత ప్రభుత్వంలో ఒక్క పోస్టూ భర్తీ చేయకపోవడంతో నిరుద్యోగుల ఆగ్రహానికి వైకాపా ప్రభుత్వం ఘోర పరాజయాన్ని చవిచూసింది. ఎన్డీయే కూటమి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి టెట్ నిర్వహణ, ఫలితాల విడుదల, డీఎస్సీ నోటిఫికేషన్, షెడ్యూల్ విడుదల వంటి విషయాలపై ఎప్పటికప్పుడు సమాచారం అందుతుండటంతో నిరుద్యోగులందరూ ఆశగా షెడ్యూలు కోసం ఎదురుచూస్తున్నారు. నవంబరు 3వ తేదీన డీఎస్సీ నోటిఫికేషన్, షెడ్యూలు విడుదలకు ప్రభుత్వం కసరత్తు చేస్తుండడంపై నిరుద్యోగుల్లో హర్షం వ్యక్తమవుతోంది.



కడప నగరంలోని ఓ శిక్షణ కేంద్రంలో డీఎస్సీకి సన్నద్ధమవుతున్న యువత

ఖాళీ పోస్టుల వివరాలివి...

ఉమ్మడి కడప జిల్లావ్యాప్తంగా ఎస్ఏ (1 లాంగ్వేజ్) 21, ఎస్ఏ (2 లాంగ్వేజ్) 10, ఆంగ్లం 36, గణితం 32, ఫిజికల్ సైన్స్ 19, బయాలజీ 19, సాంఘికశాస్త్రం 17, ఫిజికల్ ఎడ్యుకేషన్ (పీఈటీ) 73, ఎస్జీటీ 297 మొత్తంగా 524 స్పష్టమైన ఖాళీలుగా ఉన్నాయి. 2024, జనవరి నుంచి జూన్ 30వ తేదీ వరకు ఎస్ఏ (1 లాంగ్వేజ్) 3, ఎస్ఏ (2 లాంగ్వేజ్) 4, ఆంగ్లం 18, గణితం 3, పీఎస్ 6, బీఎస్ 12, ఎస్ఎస్ 14, పీఈ 4 పోస్టులు కలిపి మొత్తం 64 పోస్టులు ఖాళీలయ్యాయి. మొత్తంగా ప్రస్తుతం ఉమ్మడి కడప జిల్లావ్యాప్తంగా 588 ఖాళీలున్నాయని విద్యాశాఖ వర్గాలు చెబుతున్నాయి.

పోలీసు అమరవీరుల త్యాగాలు మరువలేనివి



పోలీసు అమరవీరుల కుటుంబసభ్యులకు కుట్టు యంత్రాలు అందజేస్తున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్, ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి

రాయచోటి, న్యూస్‌టుడే: పోలీసు అమరవీరుల త్యాగాలు మరువలేనివని కలెక్టర్ చామకూరి శ్రీధర్ పేర్కొన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా జిల్లా పోలీసు కార్యాలయ ఆవరణలోని పోలీసు కవాతు మైదానంలో సోమవారం ఆయన ఎస్పీ వి.విద్యాసాగర్ నాయుడితో కలిసి పోలీసు అమరవీరులకు నివాళులర్పించారు. తొలుత సాయుధ పోలీసుల గౌరవవందనం స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సమాజంలో పోలీసుల పాత్ర ఎంతో కీలకమైందని, ఎంతో క్లిష్టమైందన్నారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ విధి నిర్వహణలో ఉన్న పోలీసు అధికారులు, సిబ్బంది తమ విధులను విజయ వంతంగా నిర్వహించడంలో భాగంగా ప్రాణాలు అర్పించారన్నారు. ప్రజలకు ఎలాంటి ముప్పు వచ్చినా మేమున్నామంటూ ధైర్యంగా ముందుకొచ్చేవారే పోలీసులని కొనియాడారు. అనంతరం బాధిత కుటుంబాలకు కుట్టు యంత్రాలు, సైకిళ్లు, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి, భాజపా జిల్లా అధ్యక్షుడు సాయిలోకేశ్, మదనపల్లె సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్, ఆర్డీవో రంగ స్వామి, పెద్దసంఖ్యలో పోలీసు అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మాకు న్యాయం చేయండి

మదనపల్లె గ్రామీణ, న్యూస్‌టుడే: కురబలకోట మండలం ముదివేడు ప్రాజెక్టు నిర్వాసితులకు న్యాయం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, నాయకులు డిమాండు చేశారు. మదనపల్లె సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట సోమవారం వారు నిర్వాసితులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాజెక్టు నిర్మాణానికి బి.కొత్తకోట మండలం కోటావూరు పంచాయతీ దిన్నెమిదపల్లె, సీతవారిపల్లె, చవటకుంటపల్లె, కురబలకోట మండలం పిచ్చలవాండ్లపల్లె పంచాయతీ సీతువారిపల్లె, కొత్తపల్లెల్లో దాదాపు 400 మంది రైతుల నుంచి 768 ఎకరాలు స్వాధీనం చేసుకున్నారని, ఇంతవరకు పరిహారం ఇవ్వలేదని ధ్వజమెత్తారు. పునరావాసం కల్పించాలని, మార్కెట్ ధర కంటే అధికంగా పరిహారమివ్వాలని, అభివృద్ధి పనుల్లో స్థానికులకు ప్రాధాన్యమివ్వాలని డిమాండు చేశారు. నిర్వాసితులకు 5 సెంట్ల భూమి, ఇంటికొక ఉద్యోగం, ఇళ్ల నిర్మాణాలకు రూ.25 లక్షలు, భూమి లేని కుటుంబాలకు రూ.5 లక్షలు ఇవ్వాలని కోరారు. అనంతరం సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు హరిశర్మ, ప్రభాకర్, పెద్దసంఖ్యలో నిర్వాసితులు పాల్గొన్నారు.



మదనపల్లె సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న నిర్వాసితులు

ప్రభుత్వ వైద్యకళాశాలగా కొనసాగించాల్సిందే



ఆందోళన చేస్తున్న విద్యార్థులు, బీఎస్పీ నాయకులు

మదనపల్లె గ్రామీణ, న్యూస్‌టుడే: మదనపల్లెలో వైద్యకళాశాలను ప్రభుత్వ వైద్యకళాశాలగా కొనసాగించాలని బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గౌతంకుమార్, నాయకులు డిమాండు చేశారు. మదనపల్లె వైద్యకళాశాల ప్రభుత్వ గుర్తింపు రద్దును వ్యతిరేకిస్తూ మదనపల్లె సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట సోమవారం విద్యార్థులతో కలిసి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైద్య కళాశాలను ప్రైవేటీకరణ చేసేందుకు యోచిస్తున్నారని, ప్రభుత్వ కళాశాలగా గుర్తించాలన్నారు. నిరుపేద విద్యార్థులకు ప్రైవేటీకరణతో తీవ్ర నష్టం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం వారు సబ్‌కలెక్టర్ మేఘ స్వరూప్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు గంగాధర్, మహేశ్, రమణ, శివ, పెద్దసంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

పంచాయతీల సమస్యలపై ఉపముఖ్యమంత్రి స్పందించాలి

రాయచోటి, న్యూస్‌టుడే: గ్రామపంచాయతీల్లో నెలకొన్న సమస్యలపై ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ స్పందించాలని సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షుడు మోతుకూరి లక్ష్మీనారాయణ కోరారు. గ్రామపంచాయతీల్లో సమస్యల పరిష్కారం కోరుతూ కలెక్టరేట్ ఎదుట సోమవారం జిల్లాలోని సర్పంచులు నిరసన తెలిపారు. అనంతరం కలెక్టర్ చామకూరి శ్రీధర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్డీయే ప్రభుత్వం సర్పంచులకు పూర్తి అధికారాలివ్వాలని, మాజీ సర్పంచులకు జీవిత కాల పింఛను మంజూరు చేయాలని, సచివాలయ ఉద్యోగుల పనితీరు మెరుగుపడేవిధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో . సర్పంచుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు నాగార్జునాచారి, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్ చామకూరి శ్రీధర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సర్పంచులు

రండి... ఆధార్ నవీకరించుకోండి!

- మార్పులు, చేర్పులకు మరో అవకాశం
- నేటి నుంచి 25 వరకు ప్రత్యేక శిబిరాలు



ఒంటిమిట్ట గ్రామ సచివాలయంలో వేలిముద్రలు నవీకరించుకుంటున్న విద్యార్థిని

-న్యూస్‌టుడే, కడప

ఆధార్... భారత విశిష్ట ప్రాధికార సంస్థ జారీ చేసిన గుర్తింపు సంఖ్య. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందుకోవాలంటే ఆధార్ తప్పనిసరి. మరోవైపు తప్పిదాలు ఉండడంతో అధికారులు సున్నితంగా తిరస్కరిస్తున్నారు. సాంకేతిక లోపాలతో వేలిముద్రలు సక్రమంగా సరిపోలడం లేదు. ఫలితంగా ప్రజలకు అవస్థలు తప్పడం లేదు. సమస్యను అధిగమించాలని ప్రభుత్వం ముందుకొచ్చింది. నేటి (మంగళవారం) నుంచి ఈ నెల 25వ తేదీ వరకు నవీకరణకు ప్రత్యేక శిబిరాలు నిర్వహించాలని ఆదేశించింది. మార్పులు, చేర్పులకు మరో అవకాశం కల్పించారు.

● వైఎస్ఆర్, అన్నమయ్య జిల్లాల్లో గ్రామ సచివాలయాలు 846, వార్డు విభాగంలో 300 ఉన్నాయి. వీటి పరిధిలో 5-15 ఏళ్లలోపు 1,30,346 మంది, 15-17 ఏళ్లలోపు 2,05,940 మంది, 18 ఏళ్లు నిండిన వారు 3,36,286 మంది ఆధార్ కార్డులో వేలిముద్రలు నవీకరించుకోవాలని రాష్ట్ర ఉన్నతాధికారులు గుర్తించారు. ఈ మేరకు జిల్లాల వారీగా సమాచారం పంపించారు. నాలుగు రోజుల పాటు పాఠశాలలు, కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, గ్రామ, వార్డు సచివాలయాల్లో ప్రత్యేక శిబిరాలు నిర్వహించాలని ఉత్తర్వులిచ్చారు. ఎంపీడీవోలు, పురపాలక, నగరపాలక కమిషనర్లు క్షేత్రస్థాయిలో అమలు తీరుపై పర్యవేక్షణ చేయాలని ఉత్తర్వులిచ్చారు

సేవా రుసుంలు ఇలా...

ఆధార్ కేంద్రాల్లో నవీకరణ చేసుకోవడానికి ప్రభుత్వం మరో అవకాశం కల్పించింది. పిల్లలకు సంబంధించి బాలఆధార్, కొత్త ఆధార్ నమోదుకు ఎలాంటి రుసుం చెల్లించాల్సిన అవసరంలేదు. 5-7, 15-17 ఏళ్ల మధ్య బాలబాలికల బయోమెట్రిక్‌ను అప్‌డేట్ చేసుకోవడానికి సేవలు ఉచితంగా పొందవచ్చు. ఇక 7, 17 సంవత్సరాలు నిండినవారు వేలిముద్రల నవీకరణకు రూ.100 వసూలు చేస్తారు. ఆధార్‌తో చర వాణి లింక్, ఈ-మెయిల్ లింక్, డాక్యుమెంట్లు అప్‌డేట్, పేరు, చిరునామా, పుట్టిన తేదీ, లింగం మార్పు చేసుకోవడానికి రూ.50 చొప్పున చెల్లించాలి. చిత్రం+బయోమెట్రిక్+ఐరిష్ మార్పునకు రూ.100 వసూలు చేయాలని ఉన్నత స్థాయి నుంచి ఉత్తర్వులందాయి. పనిచేస్తున్న సచివాలయంలో కాకుండా మరో ప్రాంతంలో శిబిరం ఏర్పాటుకు అవసరమైన యంత్ర సామగ్రి తరలించడానికి రూ.500, శిబిరం నిర్వహణకు రూ.వెయ్యి చొప్పున కేటాయించారు.

సద్వినియోగం చేసుకోవాలి

రాష్ట్ర ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నేటి (మంగళవారం) నుంచి 25వ తేదీ వరకు ఆధార్ నమోదు, నవీకరణ చేసుకోవడానికి ప్రత్యేక శిబిరాలు నిర్వహించాలని నిర్ణయించాం. అవకాశాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలి. ఆధార్ పత్రాలు తీసుకురావాలి. మార్పులు, చేర్పులు చేసుకోవాలి. ఎలాంటి తప్పిదాలు జరగకుండా క్షేత్రస్థాయిలో అమలు తీరుపై పర్యవేక్షణ చేస్తాం.

- సుబ్రహ్మణ్యం, ప్రత్యేకాధికారి, గ్రామ, వార్డు సచివాలయాలు, కడప

రైతేరాజు 6లో

గ్రామీణ విద్యార్థినులు... క్రీడల్లో మెరికలు

రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో సత్తా



తైక్వాండో తలపడుతున్న క్రీడాకారులు

రైల్వేకోడూరు గ్రామీణ, లక్కిరెడ్డిపల్లె, న్యూస్‌టుడే: వారంతా గ్రామీణ ప్రాంత విద్యార్థినులు. ఓ వైపు చదువులో రాణిస్తూనే ఉదయం, సాయంత్రం వేళల్లో బాక్సింగ్, తైక్వాండో, కరాటే, ఫుట్‌బాల్ వంటి క్రీడల్లో శిక్షణ పొంది రాటు తేలుతున్నారు. స్వీయ ఆత్మరక్షణ కోసం ఈ క్రీడలను ఎంచుకున్న కొందరు విద్యార్థులు వాటినే జీవిత లక్ష్యంగా మలుచుకుంటున్నారు. రైల్వేకోడూరులోని ఎస్కే స్పోర్ట్స్ అకాడమీలో శిక్షకుడు మౌలా శిక్షణలో పలువురు విద్యార్థినులు, లక్కిరెడ్డిపల్లె కస్తూర్బా విద్యార్థినులు జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో విజేతలుగా నిలిచి పతకాలు కైవసం చేసుకున్నారు.

ఆత్మస్థైర్యంతో ఉండొచ్చు



నేను ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్నా. నాలుగేళ్లుగా శిక్షణ తీసుకుంటున్నా. ఇప్పటి వరకు జాతీయ స్థాయి కిక్ బాక్సింగ్‌లో 3 బంగారు పతకాలు సాధించా. నాలుగు సార్లు తైక్వాండో జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొన్నా. నౌకా దళంలో ఉద్యోగం సాధించడమే లక్ష్యం.

- షేక్ సారా, కిక్ బాక్సింగ్ క్రీడాకారిణి, రైల్వేకోడూరు

ఒలింపిక్స్‌కు వెళ్లాలన్నదే ఆకాంక్ష



మాది మామిళ్లపల్లె గ్రామం. నాకు చిన్నప్పటి నుంచి క్రీడలంటే ఎంతో ఇష్టం. అమ్మానాన్న కూలి పనులకు వెళ్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. గత నెలలో వైఎస్సార్ జిల్లా కడప క్రీడా పాఠశాలలో జరిగిన అండర్-14 ఫుట్‌బాల్ క్రీడల్లో సత్తా చాటి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యా. ఎలాగైనా దేశం తరపున ఒలింపిక్స్‌లో పాల్గొని సత్తా చాటాలన్నదే నా లక్ష్యం.

- ఎం.ప్రమీల, ఇంటర్, కస్తూర్బా పాఠశాల, లక్కిరెడ్డిపల్లె

క్రీడా కోటాలో ఉద్యోగం సాధిస్తా



నేను ఇంటర్మీడియట్ చదువుతున్నా. తైక్వాండోలో మరింత రాణించేలా సాధన చేస్తున్న. జాతీయ స్థాయి కిక్ బాక్సింగ్ పోటీలకు ఎంపికయ్యా.. పోలీసు శాఖలో ఉద్యోగం సాధించాలన్న లక్ష్యంతో ముందకెళ్తున్నా. చదువుకుంటూనే మరిన్ని పతకాలు సాధించేలా ముందుకెళ్తున్నా.

- యశ్విని, తైకాండో క్రీడాకారిణి, రైల్వేకోడూరు

తల్లిదండ్రుల ప్రోత్సాహంతో...



నేను తొమ్మిదో తరగతి చదువుతున్నా. చదువుతో పాటు ఆత్మరక్షణ క్రీడల్లో ఫైటర్‌గా ఎదగాలన్న ఆశయంతో ముందుకెళ్తున్నా. ప్రస్తుతం అండర్-19 జాతీయ క్రీడలకు ఎంపికయ్యా. మా అమ్మానాన్నల ప్రోత్సాహంతో క్రీడల్లో శిక్షణ తీసుకుంటున్నా. భవిష్యత్తులో ఒలంపిక్ క్రీడలే లక్ష్యంగా రోజూ సాధన చేస్తున్నా.

- లాస్య, న్యూ కృష్ణానగర్, తైక్వాండో క్రీడాకారిణి, రైల్వేకోడూరు

రైతేరాజు

పశువుల్లో గొంతువాపు వ్యాధిని కట్టడి చేద్దామిలా

ఒంటిమిట్ట, న్యూస్‌టుడే: పశువులకు సోకే వ్యాధుల్లో గొంతువాపు ప్రమాదకరమైంది. కళ్ల నుంచి నీరు, ముక్కు ద్వారా ద్రవం కారుతుంది. పశువులకు శ్వాస తీసుకోవడం కష్టమవుతోంది. ఊపిరితిత్తులు, శ్వాస వాహికల్లో పుండ్లు ఏర్పడి చీము చేరుతుంది. పశువు ఆయాస పడుతూ శ్వాస పీలుస్తుంది. గుర్రు గుర్రుమని శబ్దం వస్తుంది. శ్వాస కష్టమై నాలుక బయటికి వస్తుంది. సల్ఫాడిమిడిన్ 30 మి.లీ. మందును 3 రోజుల పాటు రక్తంలోకి ఎక్కించాలి. చర్మం కింద కండకు కూడా మందును అయిదు రోజుల పశువు కండకు ఇవ్వాలి. వాపు తగ్గడానికి కార్టిబోస్, జోబిడ్ మందులను 10 నుంచి 15 మి.లీ మోతాదులో మూడు రోజులు కండకు ఇవ్వాలి. వ్యాధి ప్రబలిన పశువులను కొనుగోలు చేయరాదు. జబ్బు ప్రబలకుండా పశువులకు ముందస్తుగా గొంతు వాపు టీకాలను అయిదు నెలల వయసు పైబడిన దూడలతో సహా అన్ని పశువులకు 3-5 మి.లీ లీటర్ల మోతాదులో చర్మం కింద వేయించాలి. వ్యాధి లక్షణాలు ఉన్న పశువులను మంద, పాకల నుంచి వేరు చేయాలి. పశువుల పాకలను ఫినాయిల్‌తో శుభ్రంగా కడగాలి. చనిపోయిన పశువులను గ్రామానికి దూరంగా తీసుకెళ్లి గుంత తవ్వి పొడి సున్నం చల్లి పూడ్చిపెట్టాలి. పశువులకు అందించే దాణాల్లో ఆక్సీటెట్రాసైక్లిన్ పొడి మందులను కలిపి ఇవ్వాలి. ఒక ప్రాంతం నుంచి మరో చోటకు రవాణా చేసేటప్పుడు మధ్యలో కాసేపు విశ్రాంతి ఇవ్వాలి.

- డాక్టర్ జి.రాంబాబు, పశువైద్యాధికారి, కడప

చిట్కా...



ఉల్లి పంటను పరిశీలిస్తున్న వనిపెంట కేవీకే అధిపతి బాలకృష్ణ

వర్షాకాలం... అప్రమత్తమైతే ప్రయోజనం

- న్యూస్‌టుడే, మైదుకూరు

తుపాను ప్రభావంతో ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలతో పంటలపై ప్రభావం చూపనుంది. ఉద్యాన పంటల్లో ఎక్కువ నష్టం వాటిల్లే అవకాశం ఉన్న నేపథ్యంలో ముందుజాగ్రత్త చర్యలు చేపట్టాలని వనిపెంట కృషి విజ్ఞాన కేంద్రం అధిపతి ఎం. బాలకృష్ణ తెలిపారు. పసుపు, మిరప, ఉల్లి, అరటితో పాటు కూరగాయ పంటల్లో తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. వర్షాలు ఆగిన వెంటనే 19:19:19 లేక 13:0:45 లేక యూరియావంటి పోషకాలను పంటపై పిచికారీ చేయాలని సూచించారు.

పసుపు : పొలంలో నీరు నిల్వ లేకుండా చేయాలి. 2 శాతం యూరియా లేక 1 శాతం పొటాషియం నైట్రేట్ ద్రావణాన్ని వారం రోజుల్లో 2 సార్లు పిచికారీ చేయాలి. ప్రొపికొనజోల్ 0.1 శాతం, డైఫెన్కోనజోల్ 0.1 శాతం ద్రావణాలను వారం వ్యవధిలో మార్చి మార్చి పిచికారీ చేయడంతో ఆకుమచ్చ, తాటాకు మచ్చ తెగులు నివారించవచ్చు. 0.3 శాతం కాపర్ ఆక్సీక్లోరైడ్ లేక బోర్డో మిశ్రమంతో నేలను తడపడం ద్వారా దుంపకుళ్లు తెగులు నివారించవచ్చు.

మిరప : పురుగు, తెగుళ్లు ఎక్కువగా ఆశించే అవకాశం ఉంది. సూక్ష్మధాతు లోపాలు ఎక్కువగా కనిపిస్తుంది. ఒడలిపోయిన మొక్కకు లీటరు నీటికి 5 గ్రాముల మెగ్నీషియం సల్ఫేట్ కలిపి పిచికారీ చేయాలి. మొక్కలు తేరుకున్న తరువాత స్థూల పోషకాల మిశ్రమం లీటరు నీటికి 2.5 గ్రాములు కలిపి పిచికారీ చేయాలి. బ్యాక్టీరియా ఆకుమచ్చ, కానోఫోరా వంటి తెగుళ్లు ఆశించే అవకాశం ఉన్నందున ముందు జాగ్రత్త చర్యగా 10 లీటర్ల నీటికి 30 గ్రాములు కాపర్ ఆక్సీ క్లోరైడ్ మరియు 1 గ్రాము స్ట్రెప్టోసైక్లిన్ ద్రావణం పిచికారీ చేయాలి.

ఉల్లి : ఆకుమచ్చ తెగులు నివారణకు మాంకోజెబ్ 2.5 గ్రాముల లేక క్లోరోథలోనిల్ 2 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

అరటి : ఐదారు నెలల వయసు ఉండి గెలలు వేసే దశలో ఉన్న పంట 5 రోజుల కంటే తక్కువగా ముంపునకు గురైతే వేరు వ్యవస్థ పాక్షికంగా దెబ్బతింటుంది. బ్యాక్టీరియా దుంపకుళ్లు సోకే అవకాశం ఉంది. ఆకులు తడిచేలా 5 గ్రాములు పొటాషియం నైట్రేట్ లీటరు నీటికి తీసుకుని జిగురు కలిపి వారం రోజుల్లో మూడుసార్లు పిచికారీ చేయాలి. సిగటోకా ఆకుమచ్చ తెగులు నివారణకు 1 మి.లీ ప్రొపికొనజోల్ లీటరు నీటికి జిగురుతో కలిపి పిచికారీ చేయాలి. దుంప కుళ్లి పోకుండా లీటరు నీటికి 3 గ్రాములు లేక ఒకశాతం బోర్డో మిశ్రమం దుంపచుట్టూ తడిచేలా పోయాలి. దుంపకుళ్లు సోకిన మొక్కలను గమనించి లీటరు నీటికి 25 గ్రాములు బ్లీచింగ్ పొడి కలిపి మొదలు తడిచేలా పోయాలి. అవసరాన్ని బట్టి 15 రోజుల తరువాత మరోసారి పోయాలి.


ప్రశ్న: రబీ సీజన్‌లో మినుము సాగులో విత్తనశుద్ధికి ఏ రకం మందులు పిచికారీ చేయాలి. పురుగుల ఉద్ధృతి నివారణకు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి? - ఎస్.సుబ్బరామిరెడ్డి, రైతు, రాజుపాలెం

రైతు ప్రశ్న శాస్త్రవేత్త సమాధానం

సమాధానం: మినుములు కిలో విత్తనానికి ఇమిడాక్లోప్రిడ్ 5 మి.లీ+మాంకోజెబ్ 2.5 గ్రాములు కలిపి విత్తనశుద్ధి చేస్తే రసం పీల్చే పురుగుల బారి నుంచి లేత పైరును కాపాడుకోవచ్చు. అదే విధంగా తొలి దశలో వైరస్ తెగుళ్ల వ్యాప్తి చెందకుండా కట్టడి చేయవచ్చు. ఎకరా విస్తీర్ణం పొలంలో పసుపు, నీలి వర్ణం జిగురు అట్టలను ఏర్పాటు చేసుకుంటే పచ్చదోమ, తామర పురుగుల ఉనికిని, ఉద్ధృతిని గమనించవచ్చు. వైరస్ చీడలు సోకకుండా 4-6 వరుసలో జొన్న, మొక్కజొన్న, సజ్జ పంటలను వేసుకుంటే మంచిది.

- డాక్టర్ వి.మాధురి, శాస్త్రవేత్త, వ్యవసాయ పరిశోధనా స్థానం, ఊటుకూరు

అలసంద సాగు... ప్రత్యామ్నాయంగా బాగు



సాగైన పంట

తుపాను ప్రభావంతో జిల్లాలో కురిసిన వర్షాలు ప్రత్యామ్నాయ పంటలకు అనుకూలంగా ఉన్నట్లు కలికిరి కృషి విజ్ఞాన కేంద్రం విస్తరణ, సస్యరక్షణ విభాగం శాస్త్రవేత్తలు కె. మాధురి, వై.పీరు సాహెబ్ తెలిపారు. ఈ వర్షాలకు అలసందను ప్రత్యామ్నాయ పంటగా సాగుచేస్తే రైతులకు లాభసాటిగా ఉండటమే కాకుండా తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆదాయం కూడా పొందవచ్చని సూచించారు.

● **అలసంద రకం:** టీపీటీసీ-20 రకం. తిరుపతి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం వద్ద కిలో రూ. 180కి లభిస్తుంది. రబీలో నీటి పారుదల కింద ఈ నెల నుంచి నవంబరు వరకు విత్తుకోవచ్చు. 85 నుంచి 90 రోజులు పంటకాలం. దిగుబడి ఎకరాకు 6 క్వింటాళ్లు వస్తుంది. ● **ఎరువులు :** చివరి దుక్కిలో ఎకరాకు 2 టన్నుల పశువుల ఎరువు వేసుకోవాలి. ఎకరాకు 2 కిలోల ఫాస్ఫో బ్యాక్టీరియా 200 కిలోల సేంద్రియ ఎరువుతో కలిపి దుక్కిలో గాని విత్తనం విత్తేటప్పుడు గాని సాళ్లలో పడేటట్లు వేసుకోవాలి. ఈ ఎరువు భూమిలోని మొక్కలకు లభ్యం కాని రూపంలో ఉన్న భాస్వరాన్ని మొక్కలకు అందిస్తుంది.

- న్యూస్‌టుడే, కలికిరి గ్రామీణ

భూ కబ్జాదారులపై చర్యలకు డిమాండు

మదనపల్లె గ్రామీణ, న్యూస్‌టుడే: భూ కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని అఖిలభారత రైతు కూలిసంఘం నాయకులు వెంకటరమణ డిమాండు చేశారు. సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట సోమవారం తంబళ్లపల్లె మండలం ములకలచెరువు మండలానికి చెందిన రైతులతో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ములకలచెరువు మండలం ఎంద పల్లెలో భూస్వాములు నిరుపేదల భూములను కబ్జా చేస్తున్నారని, రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. రెవెన్యూ సమస్యలపై రైతులు ఇచ్చిన అర్జీలు పరిష్కారం కాలేదన్నారు. రైతులకు సంబంధించిన పాసుపుస్తకాలు, 1బీ అడంగల్ సమస్యలున్నాయని, దీనిపై వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. నాయకులు కె.నారాయణ, సి.నారాయణ, రైతులు పాల్గొన్నారు.



సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న రైతులు, నాయకులు

గౌరవ వేతనం రూ.10 వేలు ఇవ్వాలని
వాలంటీర్ల ఆందోళన



కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న వాలంటీర్లు, సీపీఐ నాయకులు

రాయచోటి, న్యూస్‌టుడే: వాలంటీర్లకు గౌరవ వేతనం రూ.10 వేలు ఇవ్వాలని కోరుతూ సోమవారం సీపీఐ నాయకులు వాలంటీర్లతో కలిసి కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపట్టారు. సార్వత్రిక ఎన్నికల ముందు ప్రతిపక్షంలో ఉన్న చంద్రబాబు వాలంటీర్లకు ఇచ్చిన హామీని అమలు చేయాలని వారు డిమాండు చేశారు. నాలుగు నెలల వేతన బకాయిలు చెల్లించాలన్నారు. రూ.5 వేల వేతనంతో పని చేస్తూ అనేక రకాల సంక్షేమ పథకాలను ప్రజలకు అందజేస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చి నాలుగు నెలలు గడిచినా వాలంటీర్ల సమస్యలు పరిష్కరించలేదన్నారు. వాలంటీర్ల వ్యవస్థను కొనసాగించి వేతనం రూ. 10 వేలు ఇవ్వాలని డిమాండు చేశారు. అనంతరం సీపీఐ నాయకులతో కలిసి ర్యాలీగా కలెక్టరేట్‌కు చేరుకుని కలెక్టర్ శ్రీధర్‌కు వినతి పత్రం అందజేశారు. రాష్ట్ర గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విశ్వనాథనాయక్, సీపీఐ నాయకులు ఎస్. శ్రీనివాసులు, దళిత హక్కుల పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి సుధీర్‌కుమార్, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ, వాలంటీర్ల అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

యువకుడి హత్య కేసులో నిందితుల అరెస్టు

మదనపల్లె నేరవార్తలు, న్యూస్‌టుడే : ఇటీవల కురబలకోట మండలంలో యువకుడిని హత్య చేసిన ఘటనలో ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్లు మదనపల్లె డీఎస్పీ దర్బార్ కొండయ్యానాయుడు పేర్కొన్నారు. ఈ మేరకు ఈ కేసుకు సంబంధించిన వివరాలు డీఎస్పీ వెల్లడించారు. కురలకోటలో ఈ నెల 18న రాత్రి వేంపల్లె ఖాదర్‌బాషా(26)ను గుర్తు తెలియని వ్యక్తులు దారుణంగా హత్య చేశారు. దీనిపై ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు ఆదేశానుసారం సీఐ రమేష్, ఎస్ఐ దిలీప్‌కుమార్‌ల ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. విచారణలో వేంపల్లె ఖాదర్‌బాషా కురబలకోటలోని గడ్డవారివీధికి చెందిన నూర్‌బాషా సులేమాన్‌కు చెందిన భూమిలో నెలకు రూ.15వేలు జీతంతో పనిచేస్తున్నారు. సులేమాన్ గత 14 ఏళ్లుగా కువైట్‌లో డ్రైవర్‌గా పనిచేస్తుండగా ఈయన భార్య వేంపల్లె ఖాదర్‌బాషా ద్వారా భూమిలో పనిచేయిస్తున్నారు. సులేమాన్ భార్యకు వేంపల్లె ఖాదర్‌బాషాకు అక్రమ సంబంధం ఉందని పుకార్లు వచ్చాయి. ఈ నేపథ్యంలో ఇటీవల సులేమాన్ కువైట్ నుంచి తిరిగి వచ్చి తన బంధువైన కోటవీధికి చెందిన కల్లూరి అబ్దుల్ రహీం అలియాస్ అబ్దుల్లాకు భూమిని ఇచ్చి ఖాదర్‌బాషాను పనికి నిలిపేశాడు. తనను పనికి నిలిపేశారన్న కోపంతో సులేమాన్ కుటుంబంలోని మహిళలపై వేంపల్లె ఖాదర్‌బాషా అసభ్యంగా మాట్లాడారు. దీంతో ఖాదర్‌బాషాను అంతం చేయాలని సులేమాన్, బంధువు అబ్దుల్ రహీం, అతని స్నేహితుడు కురబలకోటలోని డీఆర్ నగర్‌కు చెందిన టేకులపాళ్యం అరుణ్‌కుమార్‌లు కలిసి వేంపల్లె ఖాదర్ బాషాను హత్య చేయాలని పథకం పన్నారు. ఈ క్రమంలో ఈ నెల 18వ తేదీ రాత్రి అబ్దుల్ రహీం, అరుణ్‌కుమార్‌లు వేంపల్లె ఖాదర్‌బాషాతో మాట్లాడే పని ఉందని ద్విచక్రవాహనంపై తీసుకెళ్లారు. కురబలకోట డంపింగ్ యార్డ్ వద్దకు వెళ్లిన వెంటనే ఇద్దరు వేంపల్లె ఖాదర్‌బాషాపై కత్తితో దాడి చేసి చంపేశారు. అనంతరం ద్విచక్రవాహనంపై పారిపోతుండగా కుక్క అడ్డురావడంతో అదుపుతప్పి కిందపడి గాయపడ్డారు. అనంతరం ప్రైవేటు వైద్యుడి వద్ద చికిత్స చేయించుకుని కడపకు వెళ్లారు. సోమవారం వీరిద్దరు తిరిగి కురబలకోటకు వస్తుండగా అప్పటికే సాంకేతిక పరిజ్ఞానంతో నిందితులను గుర్తించిన పోలీసులు బాపనవల్లె వద్ద అదుపులోకి తీసుకుని విచారించగా నేరం ఒప్పుకున్నారు. దీంతో హత్యకు పథకం వేసిన నూర్‌బాషా సులేమాన్, కల్లూరి అబ్దుల్ రహీం, టేకులపాళ్యం అరుణ్‌కుమార్‌లను అరెస్టు చేసి వారి వద్ద నుంచి హత్యకు వినియోగించిన రెండు కత్తులు, ఒక ద్విచక్రవాహనం స్వాధీనం చేసుకుని రిమాండుకు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు. హత్యకేసులో నిందితులను అరెస్టు చేసేందుకు కృషి చేసిన సీఐ రమేష్, ఎస్ఐ దిలీప్‌కుమార్, సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ కొండయ్యానాయుడు, పోలీసులు

నిబంధనలు పాటించకుంటే అనుమతులు రద్దు

మదనపల్లె గ్రామీణ, న్యూస్‌టుడే: నిబంధనలు పాటించకుండా ఏర్పాటు చేసే బాణాసంచా దుకాణాల అనుమతులను రద్దు చేస్తామని సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్ పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో దీపావళికి తాత్కాలిక బాణాసంచా దుకాణాల ఏర్పాటుకు సంబంధించి అధికారులు, లైసెన్సుదారులతో సమావేశం నిర్వహించారు. దుకాణాల మధ్య కనీసం 3 మీటర్లకు పైగా దూరం ఉండేలా చూడాలని, నీరు, ఇసుక తదితర ప్రమాదాల నివారణ చర్యలకు సంబంధించిన వస్తువులు తప్పనిసరిగా ఉండాలని, ఇందుకు సంబంధించి అగ్నిమాపక కేంద్రం అనుమతులు తప్పనిసరిగా ఉండాలన్నారు. దుకాణాల వద్ద ట్రాఫిక్ నియంత్రణపై పోలీసుశాఖ, రెవెన్యూశాఖ సమన్వయంతో పనిచేయాలన్నారు. పురపాలక సంఘం, రెవెన్యూ, అగ్నిమాపక, పోలీసుశాఖలు సమన్వయంతో దీపావళి పండగను ప్రజలు ప్రశాంతంగా నిర్వహించుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. బీటీ కళాశాల మైదానం, మిషన్ కాంపౌండ్‌లల్లో ఏర్పాటు చేసేందుకు అనుకూలతలపై కమిటీ క్షేత్రస్థాయిలో పరిశీలించి తదనంతరం, తాత్కాలిక దుకాణాలు ఎక్కడ ఏర్పాటు చేయాలనే అంశంపై తెలియజేస్తామన్నారు. మున్సిపల్ కమిషనర్ ప్రమీల, తహసీల్దార్లు ఖాజాబీ, నిర్మలాదేవి, తపశ్విని, ధనుంజేయులు, అగ్నిమాపకకేంద్రం అధికారి శివన్న, విద్యుత్తు, రెవెన్యూ, పోలీసుశాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్, పక్కన డీఎస్పీ కొండయ్యానాయుడు

ఆసుపత్రిలో ప్రసవాల సంఖ్య పెంచండి

కంభంవారిపల్లి, న్యూస్‌టుడే : ఆసుపత్రి ప్రసవాల సంఖ్యను పెంచాలని జిల్లా వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమ అధికారిణి ఉషశ్రీ అన్నారు. మండలంలోని గర్నిమిట్ట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఉష శ్రీ దస్త్రాలు, సిబ్బంది హాజరు పట్టిక, టీకాల నిల్వను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గర్భిణులను త్వరగా గుర్తించి, హైరిస్క్ గర్భిణుల నమోదు శాతాన్ని పెంచాలన్నారు. పిల్లలందరికీ టీకాలు క్రమం తప్పకుండా వేయాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారిణి రేష్మ, వైద్య సిబ్బంది పురుషోత్తం, రమణి, భానుప్రియ, కవిత తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి విషయమై ఇరువర్గాల ఘర్షణ

నలుగురికి గాయాలు... అయిదుగురిపై కేసు నమోదు

ఓబులవారిపల్లె, న్యూస్‌టుడే: ప్రభుత్వ భూమి విషయమై రెండు వర్గాలు ఘర్షణకు దిగిన సంఘటన ఓబులవారిపల్లె మండలం పెరుమాలపల్లెలో సోమవారం చోటుచేసుకుంది. ఎస్సై మహేష్‌నాయుడు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దఓరంపాడు రెవెన్యూ పరిధిలోని 13 ఎకరాల ప్రభుత్వ భూమికి సంబంధించి పెరుమాలపల్లె కమ్మపల్లె హరిజనవాడకు చెందిన పలువురు పట్టాదారు పాసుపుస్తకాలు పొందారు. అదే భూమిని కాకర్లవారిపల్లెకు చెందిన పలువురు ఆన్‌లైన్ చేయించుకున్నారు. ఈ విషయమై ఇరు వర్గాల మధ్య కొంతకాలంగా వివాదం నడుస్తోంది. ఈ క్రమంలో సోమవారం కాకర్లవారిపల్లెకు చెందిన కస్తూరి వెంకటేశ్వర్లు, శివయ్యనాయుడు, కోటయ్య మరో ఇద్దరితో కలిసి సదరు భూమిలో యంత్రాలతో చదును చేస్తుండగా. . పెరుమాలపల్లె కమ్మపల్లె హరిజనవాడకు చెందిన పంట నరసింహులు, కృష్ణ, మడగల ప్రభుదాస్, జనార్దన్‌లు అడ్డుకునే యత్నం చేశారు. దీంతో ఇరు వర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. దాడిలో నరసింహులు, కృష్ణ, జనార్దన్, ప్రభుదాస్‌లకు గాయాలయ్యాయి. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వారి ఫిర్యాదు మేరలకు అయిదుగురిపై కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు. ఈ విషయమై తహసీల్దార్ శ్రీధర్‌రావును వివరణ కోరగా.. పెద్దఓరంపాడు రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 1150లో 221 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందన్నారు. రెవెన్యూ కార్యాలయం నుంచి అధికారికంగా ఎవరికీ పట్టాలు ఇవ్వలేదన్నారు. ఇరువర్గాలు పొందిన పత్రాలకు సంబంధించి కార్యాలయంలో ఎటువంటి ఆధారాలు లేవన్నారు. పూర్తి స్థాయిలో విచారణ చేసి ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు.



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు


మహిళ ఆత్మహత్య



గంగులమ్మ (పాత చిత్రం)

మదనపల్లె నేరవార్తలు, న్యూస్‌టుడే : మనస్తాపంతో మహిళ ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన మదనపల్లె పట్టణంలో సోమవారం ఉదయం వెలుగు చూసింది. పట్టణంలోని అమ్మచెరువు మిట్టకు చెందిన గంగులమ్మ(58) భర్త రమణ సుమారు 30 ఏళ్ల కిందట అనారోగ్యంతో మృతి చెందారు. కుమార్తెకు వివాహం చేశారు. అప్పటి నుంచి గంగులమ్మ టమాట మార్కెట్‌లో కూలీ పనులు చేసుకుంటూ ఒంటరి జీవనం సాగిస్తున్నారు. కొంత కాలంగా అధిక రక్తపోటుతో బాధపడుతున్నారు. ఈ నేపథ్యంలో అనారోగ్యం, ఒంటరి జీవితం భరించలేక ఆదివారం రాత్రి ఇంట్లోనే ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. ఈ మేరకు సోమవారం ఉదయం తల్లికి ఫోన్ చేసినా తీయకపోవడంతో కుమార్తె ఇంటికి వచ్చింది. ఇంట్లో తల్లి ఉరి వేసుకుని వేలాడుతూ కనిపించారు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. రెండోపట్టణ సీఐ రామచంద్ర, ఎస్ఐలు రవికుమార్, రహిముల్లాలు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం ఆసుపత్రి శవాగారానికి తరలించారు. కుమార్తె రమ ఫిర్యాదు మేరకు ఆత్మహత్య కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నామని సీఐ తెలిపారు.

పారిశుద్ధ్య కార్మికుల నిరసన



పురపాలక సంఘం కార్యాలయం ఆవరణలో నిరసన తెలుపుతున్న కార్మికులు

మదనపల్లె పట్టణం,న్యూస్‌టుడే : పురపాలకసంఘం పారిశుద్ధ్య విభాగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి సురేష్‌కుమార్ అన్నారు. ఈ మేరకు సోమవారం కార్యాలయ ఆవరణలో పారిశుద్ధ్య కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సురేష్‌కుమార్ మాట్లాడుతూ.. కార్మికులకు ఇవ్వాల్సిన సబ్బులు, నూనెలు, చెప్పులు, పనిముట్లు తక్షణమే ఇవ్వాలన్నారు. పారిశుద్ధ్య విభాగంలో నెలకొన్న సమస్యలపై కమిషనర్‌కు విన్నవించామని పరిష్కరించకపోవడంతోనే నిరసన తెలుపుతున్నామని స్పష్టం చేశారు. విజయవాడ వరద సహాయక చర్యల్లో పాల్గొనేందుకు మదనపల్లె పురపాలకసంఘం నుంచి 70 కార్మికులు వెళ్లారని, వారికి రెండు జతల దుస్తులు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించినా ఇంత వరకు దాన్ని అమలు చేయలేదన్నారు. ఇంజినీరింగ్, పారిశుద్ధ్య విభాగంలో పనిచేస్తున్న కార్మికులకు బీమా గత జులై నాటికి గడువు పూర్తయిందని ఇంత వరకు పునరుద్ధరించలేదన్నారు. కార్మికుల సమస్యలు పరిష్కారించకుంటే సమ్మెబాట పడుతామని హెచ్చరించారు. యూనియన్ నాయకులు నాగరాజు, పృథ్వీరాజ్, ముబారక్, శేఖర, ఓబులేశు తదితరులు పాల్గొన్నారు.

పట్టపగలే రెండిళ్లల్లో చోరీలు

485 గ్రాముల బంగారు, రూ.5.10 లక్షల నగదు అపహరణ

రాయచోటి, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రం రాయచోటిలో సోమవారం పట్టపగలే దొంగలు రెండు ఇళ్లల్లో చోరీలకు పాల్పడ్డారు. గున్నికుంట్ల రోడ్డులో నివాసముంటున్న రామ్మోహన్‌రెడ్డి దంపతులిద్దరూ ఉపాధ్యాయులు కావడంతో ఉదయాన్నే ఇంటికి తాళం వేసి విధులకు వెళ్లారు. సాయంత్రం తిరిగి వచ్చి చూసే సరికి ఇంటికి తాళం తీసేసి ఉండడంతో లోపలికి వెళ్లి చూడగా బీరువాను పగులకొట్టి 450 గ్రాముల బంగారు నగలు, రూ. 4.50 లక్షల నగదు దోచుకెళ్లినట్లు గుర్తించారు. వెంటనే 100కు కాల్ చేయడంతో పట్టణ సీఐ చంద్రశేఖర్, ఎస్సై నరసింహారెడ్డి సిబ్బందితో అక్కడికి చేరుకుని పరిసరాలను పరిశీలించారు. విషయం తెలుసుకున్న ఎస్పీ వి.విద్యాసాగర్‌నాయుడు అక్కడికి చేరుకుని ఆరా తీశారు. అదేవిధంగా పట్టణంలోని వెంకటేశ్వర వీధిలోని అశోక్‌రెడ్డి ఇంట్లోనూ దొంగలు ప్రవేశించి 35 గ్రాముల బంగారు నగలు, రూ. 60 వేలు నగదును దోచుకెళ్లారని బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు జాగిలాలతో పరిసర ప్రాంతాలకు వెళ్లి పరిశీలించారు. క్లూస్ టీం ఆధారాలు సేకరించారు. కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ చంద్రశేఖర్ పేర్కొన్నారు.



చోరీ జరిగిన ఇంట్లో పరిశీలిస్తున్న పోలీసులు

మదనపల్లె

•మదనపల్లె • పీలేరు • తంబళ్లపల్లె

విద్యార్థులకు అభినందనలు


ప్రశంసాపత్రాలు, పతకాలు పొందిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

పీలేరు, న్యూస్‌టుడే: విద్యార్థులు చదువుతో పాటు సంప్రదాయాలను గౌరవించి, ఆచరించి భవిష్యత్తు తరాలవారికి అందించాలని పీలేరు ప్రధాన ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు సురేంద్రనాథరెడ్డి అన్నారు. పాఠశాల విద్యార్థులు తిరుపతి మహతీ ఆడిటోరియంలో భారతీయ కళాక్షేత్రం కార్యక్రమంలో ఆదివారం పాల్గొని వివిధ పోటీల్లో పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటి ప్రశంసాపత్రాలు, పతకాలు అందుకున్నారు. ఈ సందర్భంగా వారిని ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో తెలుగు ఉపాధ్యాయులు భాస్కర్, వృత్తివిద్య ఉపాధ్యాయురాలు కోమల పాల్గొన్నారు.

అయోడిన్ లోపంతో ఆరోగ్య సమస్యలు


అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

వాల్మీకిపురం, న్యూస్‌టుడే: మానవ శరీరంలో అయోడిన్ లోపంతో ఆరోగ్యం మందగించడంతో పాటు అనేక సమస్యలు వస్తున్నాయని మండల వైద్యాధికారి శ్రీవిద్య అన్నారు. సోమవారం మండలంలోని ఆరమడక పంచాయతీలో చింతపర్తి పీహెచ్‌సీ ఆసుపత్రి ఆధ్వర్యంలో ప్రపంచ అయోడిన్ లోప వ్యాధుల నివారణ దినోత్సవాన్ని నిర్వహించారు. అయోడిన్ లోపంపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది మహమ్మద్ రఫీ, సుధాకర్, రమ్య, ధనలక్ష్మి, ఆశా కార్యకర్తలు, ఆరమడక గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM to 1 PM)
మదనపల్లె : 8008574611
పీలేరు : 8008574958
తంబళ్లపల్లె : 8008574612

?: బి.కొత్తకోటలోని జడ్పీ అతిథిగృహం మీదుగా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లే రహదారికి ఇరువైపులా పిచ్చి మొక్కలు ఉన్నాయి. రాకపోకలకు ఇబ్బందిగా మారింది. - **స్థానికుడు**

✓: పిచ్చిమొక్కలను తొలగించి రాకపోకలకు అనువుగా తీర్చిదిద్దుతాం. - **రాజేంద్ర, ఏఈ, బి.కొత్తకోట నగర పంచాయతీ** - **న్యూస్‌టుడే, బి.కొత్తకోట**

ట్రాఫిక్ కష్టాలు తీరేదెప్పుడో?

బెంగళూరు బస్టాండులో నిత్యం రద్దీతో మదనపల్లె వాసులు సతమతం


బెంగళూరు బస్టాండులో ట్రాఫిక్ రద్దీ (పాత చిత్రం)

మదనపల్లె పట్టణం, న్యూస్‌టుడే : పట్టణం నడిబొడ్డున బెంగళూరు బస్టాండు నిత్యం రద్దీగా ఉంటుంది. ప్రైవేటు బస్సుల పార్కింగ్, పూలమండీలు, తోపుడు బండ్లు ఉంటాయి. పట్టణంలోని ప్రధాన వీధులైన అప్పారావువీధి, పెద్ద మసీదువీధి, పటేల్‌రోడ్డు వారపు సంతరోడ్డు బెంగళూరు బస్టాండులో కలుస్తాయి. దీనికి తోడు ఆర్టీసీ బస్టాండు నుంచి బెంగళూరు, కదిరి, అనంతపురం వాహనాలు ఈ బస్టాండు మీదుగానే వెళ్తాయి. దీంతో బస్టాండు ఎప్పుడు రద్దీగా ఉంటోంది. పరిసర మండలాల నుంచి రైతులు పండించే పూలను ఇక్కడున్న మండీల్లో విక్రయిస్తారు. ఇలా ప్రతి రంగంలో పనిచేసే వ్యక్తికి బెంగళూరు బస్టాండుతో ముడిపడి ఉంది.

ఇబ్బందులు తప్పడం లేదు

పట్టణ ప్రజలకు ఇక్కడ ట్రాఫిక్ ఇబ్బందులు తప్పడం లేదు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ట్రాఫిక్ రద్దీ తగ్గడం లేదు. ప్రైవేటు బస్సులు రోడ్డు పక్కనే పార్కింగ్ చేసి లోడింగ్ చేసుకోవడంతో ట్రాఫిక్‌కు మరింత అంతరాయం ఏర్పడుతోంది. ఒక్కోసారి అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు చాలా ఇబ్బందులకు గురికావాల్సి వస్తోంది. ట్రాఫిక్ రద్దీతో 108 అంబులెన్స్ కూడా తరచూ ఇక్కడ ఆగిపోవాల్సి వస్తోంది. ఇక పండగ సమయాల్లో ఇక్కడ పరిస్థితి అదుపులో ఉండదు. వర్షం వచ్చిందంటే బస్టాండు పరిసర ప్రాంతం మురుగు, వర్షపు నీరు కలిసి చెరువును తలపిస్తుంది. ఇందిరమ్మ విగ్రహం పక్కన అప్పారావువీధికి వెళ్లే దారిలో గుంతలు పడ్డాయి. వర్షం వచ్చినప్పుడు ఇక్కడ నీరు నిలిచిపోవడంతో వాహనదారులు గుంతల్లో పడి ప్రమాదాల బారిన పడుతున్నారు. బస్టాండు ప్రాంతంలో ఒక కానిస్టేబుల్ లేదా హోంగార్డును నియమించి ట్రాఫిక్‌ను నియంత్రిస్తున్నారు. ఒక్కరితో ఇక్కడ ట్రాఫిక్‌ను నియంత్రించడం సాధ్యం కావడం లేదు. అదనంగా సిబ్బందిని ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. బెంగళూరు బస్టాండు వెనుకనే బాహుదానది ఉంది. ఈ నదిలో వ్యర్థాలను వేయడంతో కలుషితం అవుతోంది. బస్టాండు పరిసర ప్రాంతాల్లో కూడా పారిశుద్ధ్యం అధ్వాన్నంగా ఉంది.

విద్యార్థులకు వసతులు కల్పించండి


విద్యార్థినులతో మాట్లాడుతున్న న్యాయమూర్తి మహేష్

పీలేరు, న్యూస్‌టుడే: విద్యార్థులను ఉపాధ్యాయులు తల్లిదండ్రులుగా చూసుకోవాలని పీలేరు 11వ అదనపు జిల్లా న్యాయమూర్తి ఏ.మహేష్ అన్నారు. ఈ మేరకు సోమవారం పీలేరు ప్రధాన ఉన్నత పాఠశాల, వినాయక ఆలయం వద్ద ఉన్న ఉన్నత పాఠశాలను తనిఖీ చేసి మధ్యాహ్న భోజనాన్ని ఆయన పరిశీలించారు. భోజనం తిని నాణ్యత, మధ్యాహ్న భోజనం అందరూ తింటున్నారా, ఏమైనా సమస్యలున్నాయా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని సూచించారు. కార్యక్రమాల్లో ప్రధానోపాధ్యాయులు సురేంద్రరెడ్డి, నటరాజ, న్యాయవాది షౌకత్ ఆలి, పారలీగల్ వాలంటీర్లు బాటసారి, నిర్మలమ్మ పాల్గొన్నారు.

గ్రామసభలు సద్వినియోగం చేసుకోండి

నిమ్మనపల్లె, న్యూస్‌టుడే : భూముల రీసర్వే పూర్తి అయిన గ్రామాల్లో గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ ధనుంజయులు తెలిపారు. వీటిలో భూ సమస్యలపై అభ్యంతరాలు తెలపవచ్చని చెప్పారు. ఈ నెల 23న తవళం, 24న చౌకిళ్ళవారిపల్లె, 25, 26వ తేదీల్లో నిమ్మనపల్లె, 29, 30 తేదీల్లో అగ్రహారం గ్రామాల్లో సభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

పీలేరు : మండలంలో రీసర్వే పూర్తి అయిన ఆవులవారిపల్లె, మద్దెలచెరువుపాళెం, కావలిపల్లె, జాండ్ల, అగ్రహారం గ్రామాల్లో ఈ నెల 23 నుంచి గ్రామసభలు నిర్వహిస్తామని పీలేరు తహసీల్దార్ భీమేశ్వరరావు సోమవారం చెప్పారు. రైతులు పాల్గొని తమ భూ సమస్యలపై అధికారులకు వినతిపత్రాలు ఇవ్వాలని తెలిపారు.

బి.కొత్తకోట : బి.కొత్తకోట మండలంలో భూసర్వే పూర్తయిన మూడు గ్రామాల్లో ఈ నెల 22 నుంచి రెవెన్యూ గ్రామసభలు నిర్వహించనున్నట్లు వీఆర్వో నరేంద్రబాబు తెలిపారు. కోటావూరు పంచాయతీ అమరనారాయణపురంలోని ఆలయంలో మంగళవారం ఉదయం 10 గంటలకు గ్రామసభ ప్రారంభమవుతున్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో విద్యార్థుల సత్తా

కలకడ, న్యూస్‌టుడే : రాజమహేంద్రవరంలో ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ పోటీల్లో మండలంలోని కోన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. చిత్తూరు జిల్లా క్రీడా బృందం తరఫున పాల్గొని బంగారు పతకాలు సాధించినట్లు ప్రధానోపాధ్యాయులు వెంగలరాయుడు సోమవారం తెలిపారు. పాఠశాలకు చెందిన విద్యార్థులు సమీర్‌ఖాన్, గణేష్‌యల్, షారుఖాన్, యోగేష్, మునికిరణ్, జితేంద్ర, శివతేజ క్రీడల్లో పాల్గొని జట్టును గెలిపించారని తెలిపారు. పీడీ రూన్ని రాణి, విద్యార్థులను హెచ్ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.


గెలుపొందిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

ప్రజాసంక్షేమమే ఎన్డీయే ప్రభుత్వ ధ్యేయం


పీలేరులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి


నందిరెడ్డిపల్లెలో సీసీరోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

పీలేరు గ్రామీణ, న్యూస్‌టుడే : దీపావళి నుంచి ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం పీలేరులో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విడతల వారీగా ఎన్నికల హామీలు అమలుకు చర్యలు ప్రభుత్వం తీసుకుంటుందన్నారు. ఈ క్రమంలో పింఛన్లను పెంచామన్నారు. నాయకులు, కార్యకర్తలకు అండగా ఉంటామని స్పష్టం చేశారు. ఈ నెల 26 నుంచి ప్రారంభమయ్యే సభ్యత్వ నమోదును విజయవంతం చేయాలని సూచించారు. గతంలో వైకాపా చేసిన తప్పులు మనం చేయకూడదని కార్యకర్తలకు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మదనపల్లె గ్రామీణ : రాష్ట్ర ప్రజల సంక్షేమ, రాష్ట్రాభివృద్ధే ధ్యేయంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పరిపాలన చేస్తున్నారని ఎమ్మెల్యే షాజహాన్ బాషా పేర్కొన్నారు. సోమవారం మండలంలోని గ్రామ పంచాయతీల్లో పల్లెపండగ కార్యక్రమంలో భాగంగా మంజూరైన సిమెంట్, తారురోడ్ల నిర్మాణాలకు భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో రూ.4.05కోట్లతో 74 సిమెంట్ రోడ్లు, ఒక తారురోడ్డు నిర్మాణాలకు నిధులు మంజూరైనట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ రెడ్డెమ్మ, ఎంపీడీవో మస్తాన్‌వల్లి, పంచాయతీరాజ్ డీఈ శివప్రసాద్, ఏపీవో సుబ్రహ్మణ్యం, పంచాయతీరాజ్ ఏఈ వెంకటరమణ, సర్పంచులు ప్రభాకర్, ఆనంద్ పార్థసారధి, ఉపసర్పంచి నందకుమార్, మార్కెట్‌యార్డు మాజీ ఛైర్మన్ గుర్రప్పనాయుడు, టౌన్‌బ్యాంకు మాజీ ఛైర్మన్ విద్యాసాగర్, నాయకులు శ్రీరామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

పోలీసు అమరవీరులకు నివాళి


కలికిరి నాలుగు రోడ్ల కూడలిలో మానవహారంలో పాల్గొన్న సీఐ రెడ్డిశేఖర్‌రెడ్డి, పోలీసులు, విద్యార్థులు


కలికిరి సీఆర్‌పీఎఫ్ సీఐఏటీ-3 శిక్షణ కేంద్రంలో నివాళులర్పిస్తున్న డీఐజీ అనుపమ్‌శర్మ, సిబ్బంది

కలికిరిగ్రామీణ, న్యూస్‌టుడే: కలికిరి సీఆర్‌పీఎఫ్ సీఐఏటీ-3 శిక్షణ కేంద్రంలో సోమవారం డీఐజీ అనుపమ్ శర్మ అమవీరులకు నివాళులర్పించారు. అనంతరం జరిగిన సమావేశంలో దేశరక్షణలో అమరులైన వీరుల త్యాగలను కొనియాడారు. సీఆర్‌పీఎఫ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కలికిరి: అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని సీఐ రెడ్డిశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం కలికిరి నాలుగు రోడ్ల కూడలిలో విద్యార్థులు, పోలీసు సిబ్బంది మానవహారం నిర్వహించారు. అంతకుముందు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీనివాస కళాశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి చౌకడిపో డీలర్ల సమావేశం 24న

కురబలకోట, న్యూస్‌టుడే : చౌక దుకాణాల జిల్లా సంఘ సర్వసభ్య సమావేశం ఈ నెల 24న ఉదయం 10 గంటలకు మదనపల్లెలోని మిషన్ కాంపౌండ్‌కు చెందిన జేసీఎం కమ్యూనిటీ హాలులో జరుగుతుందని చౌక దుకాణాల సంఘం డివిజన్ అధ్యక్షుడు బి.గోపాల్‌రెడ్డి తెలిపారు. ఈ సమావేశంలో మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, తెదేపా నేత జయచంద్రారెడ్డి, పౌరసరఫరాల కార్పొరేషన్ సభ్యురాలు ఫర్వీన్‌తాజ్ తదితరులు పాల్గొంటారని తెలిపారు. సమావేశంలో జిల్లాకు చెందిన నూతన కార్యవర్గాన్ని ఎన్నుకుంటామని తెలిపారు. జిల్లాకు చెందిన చౌక దుకాణ డీలర్లు సమావేశానికి హాజరు కావాలని కోరారు.

పకడ్బందీగా సాగునీటి సంఘ ఎన్నికలు

రామసముద్రం, న్యూస్‌టుడే: సాగునీటి సంఘ ఎన్నికలను పకడ్బందీగా చేపట్టేందుకు కార్యాచరణ రూపొందించాలని తహసీల్దార్ నిర్మలాదేవి ఆదేశించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం జలవనరులశాఖ ఏఈ శ్రీధర్, గ్రామ వీఆర్వోలతో ఆమె సాగునీటి సంఘ ఎన్నికల నిర్వహణపై చర్చించారు. త్వరలోనే ఓటరు జాబితాను విడుదల చేయనున్నట్లు తెలిపారు. మండలంలోని సందూరుచెరువు, పాయిచెరువు, అగ్రహారం, గొల్లపల్లె, ఊలపాడు, ఉప్పినెల్లి, కనగాని, వడ్డివానిచెరువులకు త్వరలోనే సాగునీటి సంఘ ఎన్నికలు జరుగుతాయన్నారు. సంబంధిత ఓటరు జాబితాను గ్రామసచివాలయాల్లో ఉంచుతామన్నారు. ఓటరు జాబితాలో ఎలాంటి పొరపాట్లు ఉన్న సంబంధిత వీఆర్‌వోను సంప్రదించాలని కోరారు.

ప్రభుత్వ భూమి స్వాధీనం

కురబలకోట, న్యూస్‌టుడే : మండలంలోని కురబలకోట, అంగళ్లు పరిసర ప్రాంతాలకు చెందిన పంచాయతీల్లో ఆక్రమణకు గురైన సుమారు 2.78 ఎకరాల ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకున్నామని ఆర్ఐ బాలసుబ్రహ్మణ్యం తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో పలు ప్రభుత్వ భూములు, స్థలాలన్నీ ఆక్రమణకు గురి కాగా, వీటిపై విచారణ చేయాలని ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిన నేపథ్యంలో అంగళ్లు పంచాయతీలోని సర్వే నెంబరు 118కి చెందిన 28 సెంట్ల రస్తా పొరంబోకు స్థలం ప్రభుత్వానిదేనని పేర్కొంటూ ఇందులో ఎవరైనా ప్రవేశిస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని తహసీల్దారు పేరుతో బోర్డును స్థలంలో నాటారు. జాతీయ రహదారిలో రోడ్డు పక్కనే సుమారు రూ.3 కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని గతంలో ఓ వ్యక్తి విక్రయించినట్లు ఆరోపణ వచ్చిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో రస్తా పొరంబోకు ఆక్రమణపై ప్రభుత్వానికి ఫిర్యాదు వెళ్లగా, ఈ స్థలంలో ఇచ్చిన పట్టాలు బోగస్‌గా గుర్తించి,, వాటిని గతంలోనే రద్దు చేసినట్లుగా రెవెన్యూ వర్గాలు తెలిపాయి. కురబలకోట రెవెన్యూ పరిధికి చెందిన సర్వే నంబర్లలోని 1874, 1875, 1876కు చెందిన లోతువంకలో ఆక్రమణకు గురైన సుమారు రెండున్నర ఎకరాల భూమిని కూడా స్వాధీనం చేసుకున్నామని ఆర్ఐ తెలిపారు. మండలంలో పలుచోట్ల జరిగిన ఆక్రమణలపై విచారణ జరుగుతోందని, వాటిని కూడా త్వరలో స్వాధీనం చేసుకుంటామని రెవెన్యూ అధికారి స్పష్టం చేశారు.

ఆటో డ్రైవరుపై దాడి

పీలేరు గ్రామీణ, న్యూస్‌టుడే : ఆటో డ్రైవర్‌ను ఇద్దరు యువకులు చితకబాదిన సంఘటన పీలేరులో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్ఐ బాలకృష్ణ తెలిపిన వివరాల మేరకు పీలేరు పట్టణం రాజీవ్ నగర్‌లో నివాసం ఉంటున్న హరినాథ్ ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. ఈయన సోమవారం రాత్రి ఆటోలో పాత బస్టాండు నుంచి కొత్త బస్టాండు వెళ్తుండగా మార్గమధ్యంలో ఎదురుగా వచ్చిన ఇద్దరు యువకులు మద్యం మత్తులో ఆటో డ్రైవర్‌పై విచక్షణారహితంగా దాడి చేశారు. గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం పీలేరు ఆసుపత్రికి తరలించారు. దాడికి పాల్పడిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

భార్య ఆచూకీ తెలపాలని ఫిర్యాదు

పెద్దమండ్యం : తన భార్య ఆచూకీ తెలపాలని పెద్దమండ్యం పోలీసులకు కలిచెర్లకు చెందిన వ్యక్తి ఫిర్యాదు చేశారు. వివరాలు.. కలిచెర్లకు చెందిన ఫైన్ షావల్లి 2017లో బెంగుళూరుకు చెందిన హీనాను వివాహం చేసుకున్నారు. ఈయనకు ముగ్గురు సంతానం. గత నెల 29న కలిచెర్ల మసీదులో నమాజ్ చదువుకుని సాయంత్రం ఇంటికి రాగా కనిపించలేదు. ఆమె కోసం గాలించినా ఆచూకీ లభించకపోవడంతో సోమవారం పెద్దమండ్యం పోలీసులను ఆశ్రయించారు. ఈ మేరకు అదృశ్యం కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

కేజీబీవీ విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

మదనపల్లె నేరవార్తలు, న్యూస్‌టుడే : కేజీబీవీలో చదువుతున్న ఇంటర్ విద్యార్థిని (16) పురుగుమందుతాగి ఆత్మహత్యకు యత్నించిన సంఘటన రామసముద్రం మండలంలో సోమవారం జరిగింది. మండలంలోని ఓ గ్రామానికి చెందిన విద్యార్థిని రామసముద్రం కేజీబీవీ విద్యాలయంలో చదువుతోంది. సోమవారం గ్రామం నుంచి విద్యాలయానికి వచ్చిన ఆమె సాయంత్రం పిల్లలంతా ఆడుకునేందుకు వెళ్లారు. ఆ సమయంలో విద్యార్థిని తాను ఉంటున్న గదిలోనే తనతో పాటు తెచ్చుకున్న పురుగుమందుతాగి ఆత్మహత్యకు యత్నించింది. గుర్తించిన ఉపాధ్యాయులు రామసముద్రం, మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యులు తిరుపతికి రెఫర్ చేశారు.

దళితుల సమస్యల పరిష్కారానికి వినతి

రామసముద్రం, న్యూస్‌టుడే : దళిత సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు రాజేష్, మండల అధ్యక్షుడు అయ్యప్ప, ఎమ్మెస్పీ మండల అధ్యక్షుడు సుధాకర్ డిమాండు చేశారు. తమ సమస్యలను అధికారులకు విన్నవించేందుకు సివిల్ రైట్స్ డే కార్యక్రమాన్ని నిర్వహించాలని సోమవారం తహసీల్దార్ నిర్మలాదేవికి విన్నవించారు. పలు సమస్యలను ప్రస్తావించారు. దళితవాడల్లోని తాగునీటి ట్యాంకుల్లో క్లోరినేషన్, పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలని ఎంపీడీవో భానుప్రసాద్‌ను కోరారు. దళితులపై అత్యాచారాలు, బాల్యవివాహాలు, అంటరానితనం వంటి సంఘటనలు చోటుచేసుకోకుండా గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఎస్సై వెంకటసుబ్బయ్యను కోరారు.

పరిష్కార వేదికకు 7 వినతులు

మదనపల్లె పట్టణం, న్యూస్‌టుడే : పురపాలకసంఘం కార్యాలయంలో సోమవారం ఉదయం నిర్వహించిన ప్రజా ఫిర్యాదులు పరిష్కార వేదికకు 7 సమస్యలను ప్రజలు అధికారులు దృష్టికి తీసుకొచ్చారు. అర్జీలు ద్వారా 6, ఫోన్‌ద్వారా ఒక సమస్య వచ్చింది. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను పరిష్కరించడానికి సంబంధితశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని కమిషనర్ ప్రమీల ఆదేశించారు.

వినికిడి లోపాలపై జాగ్రత్తలు తీసుకోండి

మదనపల్లె వైద్యం, న్యూస్‌టుడే : చిన్నారుల వినికిడి సమస్యలపై జాగ్రత్తలు తీసుకోవాలని మదనపల్లె డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో రమేష్‌బాబు, ఆసుపత్రి సూపరింటెండెంట్ ఎంఎస్ రాజు, వైద్య కళాశాల ప్రిన్సిపల్ జమున అన్నారు. సోమవారం ప్రభుత్వ సర్వజన బోధన ఆసుపత్రిలోని డీఈఐసీ భవనంలో దీనదయాల్ శ్రవణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వినికిడి సమస్య ఉన్న చిన్నారులకు వికలత్వ నిర్ధారణ శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన వారు మాట్లాడుతూ పిల్లలో చిన్నప్పుడే వినికిడి సమస్య ఉన్నట్లు గుర్తిస్తే వెంటనే వారిని ఆసుపత్రికి తీసుకురావడంతో వికలత్వాన్ని గుర్తించి వారికి సరైన చికిత్స అందిస్తే వినికిడి సమస్య పరిష్కరించే వీలుంటుందన్నారు. అనంతరం వినికిడి పరీక్షల శిబిరాన్ని ప్రారంభించారు. ఆర్‌బీఎస్‌కే ప్రోగ్రాం అధికారి శివప్రతాప్, చిన్నపిల్లల వైద్యుడు సురేష్‌రెడ్డి, డాక్టర్ నవీన్‌కుమార్, ఆడియాలజిస్ట్ దీప్తి, డీఈఐసీ సిబ్బంది పాల్గొన్నారు.

బాలకార్మిక వ్యవస్థ చట్టరీత్యా నేరం

పీలేరు, న్యూస్‌టుడే: పాఠశాలకు వెళ్లాల్సిన వయసులోని పిల్లలను పనిలో పెట్టుకుని బాలకార్మికులను ప్రోత్సహించడం చట్టపరంగా నేరమని పీలేరు సహాయ కార్మికశాఖ అధికారి కేఆర్ ఆనంద్‌బాబు అన్నారు. సోమవారం ఆయన పీలేరు పట్టణంలోని వివిధ దుకాణాలు, హోటళ్లను తనిఖీ చేసి బాలకార్మికుల వ్యవస్థను వ్యతిరేకించాలని అందరికి సూచించారు. బాగా చదువుకునే విద్యార్థులకు ప్రభుత్వ వసతిగృహాల్లో చేర్పించి చదివించాలని అన్నారు. బలవంతంగా పనులకు పంపించే తల్లిదండ్రులు, పనిలో పెట్టుకుని యజమానులపై కేసులు నమోదు చేయిస్తామని అధికారి హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంఈవో లోకేశ్వరరెడ్డి, గ్రేట్ విజన్ సంస్థ అధ్యక్షులు జీవీఎస్ బాబు, ఎఎస్సై నాగప్పనాయక్, సీఆర్పీ మురళీధర్‌రాజు, ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న కార్మికశాఖ అధికారి ఆనందబాబు, అధికారులు

ఉత్సాహంగా ప్రతిభా పాటవ పోటీలు


పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

మదనపల్లె విద్య, పట్టణం, న్యూస్‌టుడే : మదనపల్లెలోని జ్ఞానోదయ ఆంగ్ల మాధ్యమం ఉన్నత పాఠశాలలో సోమవారం 'ఈనాడు' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. ఇందులో భాగంగా 'ఇంటర్నెట్ వినియోగంతో లాభనష్టాలు, విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం' అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులు ఆర్.యశ్విని (పదో తరగతి), పి.సుష్మరాజ్ (ఎనిమిదోతరగతి), పి. రెడ్డిప్రసాద్‌రెడ్డి (తొమ్మిదో తరగతి)లకు ప్రిన్సిపల్ కామకోటి ప్రసాద్‌రావు, డైరెక్టర్ భవానీ ప్రసాద్‌లు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కె.ఎస్.చక్రవర్తి, లక్ష్మీరెడ్డి, శ్రీకాంత్, ప్రసన్నలక్ష్మీ పాల్గొన్నారు.


విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ప్రిన్సిపల్ ప్రసాద్‌రావు, ఉపాధ్యాయులు

ప్రతిభ చాటి... విజేతలుగా నిలిచి


వ్యాసరచన పోటీల్లో విద్యార్థులు

మదనపల్లె విద్య, పట్టణం, న్యూస్‌టుడే : మదనపల్లె పట్టణంలోని మాస్టర్‌మైండ్స్ ఆంగ్ల మాధ్యమం ఉన్నత పాఠశాలలో సోమవారం 'ఈనాడు' ఆధ్వర్యంలో 'ఇంటర్నెట్ వినియోగంతో లాభనష్టాలు, విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం' అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పోటీల్లో విద్యార్థులు పాఠశాల నుంచి 8, 9, 10 తరగతుల విద్యార్థులు హాజరయ్యారు. ఇందులో గెలుపొందిన విద్యార్థులు ఎస్.ప్రవల్లిక, కె.దీరజ్ (9వ తరగతి), ఎస్.షారిగ (8వ తరగతి)లు విజేతలుగా నిలిచారు. వీరికి పాఠశాల డైరెక్టర్ ఉత్తమ్‌చౌదరి, ప్రిన్సిపల్ నాగప్రతాప్‌లు బహుమతులు అందజేశారు.


విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న పాఠశాల డైరెక్టర్ ఉత్తమ్‌చౌదరి, ప్రిన్సిపల్ నాగప్రతాప్

భూవివాదాలపై ఫిర్యాదుల వెల్లువ

విచారించి నివేదిక ఇవ్వాలని సబ్‌కలెక్టర్ ఆదేశం

మదనపల్లె గ్రామీణ, న్యూస్‌టుడే: అర్జీదారుల సమస్యలను పరిష్కరించి నివేదికను ఇవ్వాలని సంబంధిత అధికారులను సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్ ఆదేశించారు. సోమవారం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 120 మంది అర్జీదారులు తమ సమస్యలను సబ్‌కలెక్టర్‌కు విన్నవించారు. ఇందులో భూ సమస్యలపై ఎక్కువ మంది నుంచి ఫిర్యాదులు వచ్చాయి. ఆదివారం సబ్‌కలెక్టర్ కార్యాలయం ఆవరణంలో చెట్టుకూలి గాయపడిన చంద్రశేఖర్ పరిస్థితి ఆందోళనకరంగా ఉందని వైద్యం కోసం ప్రభుత్వం తరఫున సాయం చేయాలని కుమార్తె భార్గవి అర్జీ సమర్పించారు. మదనపల్లె బొమ్మనచెరువు మీదుగా రామసముద్రానికి వెళ్లే రోడ్డు అధ్వానంగా ఉందని, మరమ్మతులు చేయించాలని ఆ ప్రాంతవాసులు అర్జీ ఇచ్చారు. పలు సమస్యలను ప్రజలు సబ్‌కలెక్టర్‌కు విన్నవించారు. దీనిపై విచారించి నివేదిక ఇవ్వాలని సబ్‌కలెక్టర్ ఆయా మండల అధికారులను ఆదేశించారు.


అర్జీదారులను విచారిస్తున్న మదనపల్లె సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్

మిలటరీ పట్టాను రద్దు చేశారు



మా తండ్రి నరసింహులు సైనికుడిగా సేవలందించారు. ఆయన పేరున 1989లో 3.77 ఎకరాలు వలసపల్లె వద్ద భూమి ఇచ్చారు. తండ్రి 1993లో మృతి చెందారు. సంబంధిత భూమిలో ఇళ్లు నిర్మించి అనుభవంలో ఉన్నాం. మాకు సంబంధించిన పట్టాను రద్దు చేసి ఇతరుల పేరున అనుభవంలో ఉన్నట్లు దస్త్రాల్లో నమోదు చేశారు. విచారించి న్యాయం చేయండి. - **దేవముని, వలసపల్లె**

దస్త్రాలను పరిశీలించి న్యాయం చేయండి



మా అమ్మ గౌరమ్మ, చిన్నమ్మ శంతమ్మ పేరున పట్టా ఉంది. 4.94 ఎకరాల్లో వ్యవసాయం సాగుచేసుకుంటున్నాను. మా ఆధీనంలో ఉంది. ఇతరులు రెవెన్యూ దస్త్రాల్లో వారి పేర్లు ఆన్‌లైన్ చేసుకుని, పాసుపుస్తకం చేసుకుని మమ్మల్ని అడ్డుకుంటున్నారు. రెవెన్యూ దస్త్రాలను పరిశీలించి న్యాయం చేయండి. - **వెంకటశివ, బోదలవారిపల్లె**

హద్దులు ఏర్పాటు చేయించండి



మా అత్త పాపులమ్మ నా పేరున మూడు వేర్వేరు సర్వే నంబర్లల్లో వ్యవసాయ భూమి ఇచ్చింది. దీనిపై పాసు పుస్తకం, 1 బీ నా పేరున ఉంది. ఇతరులు నాపై దౌర్జన్యం చేస్తూ స్థలంలోనికి రానివ్వడం లేదు. భూమిలోనికి వెళ్లేందుకు అడ్డపడుతున్నారు. క్షేత్రస్థాయిలో విచారించి నా భూమి సర్వేచేసి సరిహద్దులు నాటించాలని కోరుతున్నాం. - **రమణమ్మ, చిన్నపల్లె**

నలుగురిపై కేసు నమోదు

మదనపల్లె నేరవార్తలు, కురబలకోట), న్యూస్‌టుడే : సామాజిక మాధ్యమాల్లో ఓ మహిళపై అసభ్యకరంగా పోస్టులు పెట్టిన నలుగురిపై కేసు నమోదు చేసినట్లు మదనపల్లె రూరల్ సర్కిల్ సీఐ రమేష్ తెలిపారు.

రాయచోటి
• రాయచోటి • రాజంపేట • రైల్వేకోడూరు

విలువిద్య క్రీడాకారుడికి వైఎస్‌ఆర్ జిల్లా ఎస్పీ అభినందనలు

లక్కిరెడ్డిపల్లె, న్యూస్‌టుడే: విలువిద్య క్రీడలో రజత పతకం సాధించిన విద్యార్థి అభినయ్‌ని వైఎస్సార్ జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు సోమవారం ఆయన కార్యాలయంలో అభినందించారని లక్కిరెడ్డిపల్లె మండలం ఈడిగపల్లెకు చెందిన విద్యార్థి తల్లిదండ్రులు సి.హరినాథ, ప్రసన్నలు తెలిపారు. ఈ నెల 20వ తేదీన బెంగళూరులో జరిగిన సౌత్ జోన్ ఇండోర్ ఆర్చరీ ఛాంపియన్‌షిప్‌లో ఏపీ నుంచి కాంపౌండ్ విభాగంలో తమ కుమారుడు రజత పథకం సాధించాడని చెప్పారు. ఈ సందర్భంగా కడపలోని ఎస్పీ కార్యాలయంలో ఎస్పీతో పాటు అదనపు ఎస్పీ ప్రకాష్‌బాబు, ఏఆర్ అదనపు ఎస్పీ పి.రమణయ్యలు అభినందించారని పేర్కొన్నారు.


అభినయ్‌ని అభినందిస్తున్న ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

సీపీఎం మహాసభల జయప్రదానికి పిలుపు

రాయచోటి గ్రామీణ, న్యూస్‌టుడే: ప్రభుత్వ వైఫల్యాలను నిరసిస్తూ ఈ నెల 26, 27 తేదీల్లో రాయచోటిలో జరిగే సీపీఎం జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు పిలుపునిచ్చారు. స్థానిక కార్యాలయంలో సోమవారం సీపీఎం నాయకులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. పెరుగుతున్న నిత్యావసర ధరలను నియంత్రించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండు చేశారు. కార్మిక ఉద్యోగులకు సక్రమంగా జీతాలు చెల్లించాలని కోరారు. సీపీఎం నాయకులు రామాంజులు, నాగబసిరెడ్డి, వెంకటయ్య పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM to 1 PM)
రాజంపేట : 9441872651
రాయచోటి : 9703622242
రైల్వేకోడూరు : 7981695235

?: మండల కేంద్రంలోని పుటికంవారిపల్లెలో కొన్నేళ్ల కిందట ప్రభుత్వ పాఠశాల భవనం నిర్మించారు. వినియోగంలోకి తీసుకు రాలేదు. దీంతో స్థానిక విద్యార్థులు పక్క గ్రామానికి వెళ్లాల్సిన పరిస్థితి వచ్చింది. **- రాజశేఖర్, పుటికంవారిపల్లె**

✓: పుటికంవారిపల్లెలో విద్యార్థులు స్థానికంగా పాఠశాలకు వెళ్లామంటే వినియోగంలోకి తెస్తాం. గ్రామస్థులు రాతపూర్వకంగా తీర్మానం చేస్తే విచారించి చర్యలు తీసుకుంటాం. **- రెడ్డయ్య, ఎంఈవో-2, ఓబులవారిపల్లె - న్యూస్‌టుడే, ఓబులవారిపల్లి**

?: కొత్తపల్లె అరుంధతీవాడలో సుమారు 50 గృహాలున్నాయి. వీధి దీపాలు లేకపోవడంతో రాత్రి వేళల్లో ఇబ్బందులు పడుతున్నాం. **- స్థానికులు**

✓: సమస్య మా దృష్టికి రాలేదు. వెంటనే సిబ్బందిని పంపించి వీధి దీపాలు ఏర్పాటు చేయిస్తాం. **- రామ్మోహన్‌రెడ్డి, ఈవో పీఆర్డీ, ఓబులవారిపల్లె - న్యూస్‌టుడే, రైల్వేకోడూరు గ్రామీణ**

?: పట్టణంలోని శ్రీకృష్ణదేవరాయలు విగ్రహం వద్ద రహదారి గుంతలమయంగా మారింది. దీంతో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. **-రహమతుల్లా, రైల్వేకోడూరు**

✓: వీలైనంత త్వరగా మరమ్మతులు చేపడతాం. **- విజయకుమార్, డివిజన్ అధికారి, ఎన్‌హెచ్ - న్యూస్‌టుడే, రైల్వేకోడూరు**

?: శింగనమల నుంచి కొత్త శింగనమల ప్రధాన రహదారికి అంచున విద్యుత్తు స్తంభం ఒరిగి ప్రమాదకరంగా ఉంది. వెంటనే విద్యుత్తు స్తంభాన్ని రోడ్డుకు దూరంగా అమర్చాలి. **- సుబ్బరాయుడు, పెనగలూరు**

✓: సమస్య మా దృష్టికి వచ్చింది. సిబ్బందిని పంపించి విద్యుత్తు స్తంభాన్ని మార్చేందుకు చర్యలు తీసుకుంటాం. **- షఫీ, విద్యుత్తు శాఖ ఏఈ, పెనగలూరు - న్యూస్‌టుడే, పెనగలూరు**

?: రాజంపేట మండలం మదనగోపాలపురంలోని చక్రధర కాలనీ రోడ్డుపై ఇళ్లలోని మురుగు నీరు వదులుతున్నారు. దీంతో దోమల ఉద్ధృతి పెరిగి వ్యాధులు ప్రబలుతున్నాయి. **- ప్రసాద్, చక్రధర్ కాలనీ**

✓: నివాసాల నుంచి మురుగు బయటకు వదలకుండా చర్యలు తీసుకుంటాం. స్థానికులకు అవగాహన కల్పిస్తాం. **- కరీముల్లా, పంచాయతీ కార్యదర్శి, మదనగోపాలపురం, - న్యూస్‌టుడే, రాజంపేట గ్రామీణ**

?: మారెడ్డిగారిపల్లె గ్రామ సమీపంలోని రక్షిత నీటి పథకం కొన్ని రోజుల కిందట మోటారు కాలిపోయింది. తాగునీటికి ఇబ్బందులు పడుతున్నాం. **- నాయక్, ముడుంపాడు**

✓: వెంటనే సిబ్బందిని పంపించి మోటారు మరమ్మతులు చేయిస్తాం. తాగునీటి సమస్య తీరుస్తాం. **- ప్రసాద్, ఏఈ, ఆర్‌డబ్ల్యూఎస్, సుండుపల్లి - న్యూస్‌టుడే, సుండుపల్లి**

?: రాయచోటి-వీరబల్లి మార్గంలో వడ్డెపల్లె వద్ద రోడ్డు తగ్గుగా ఉండడంతో వాననీటి నిల్వలు రోజుల తరబడి ఉంటున్నాయి. దుర్వాసన వెదజల్లుతోంది. **- స్థానికులు, వడ్డెపల్లె**

✓: రహదారిపై నీరు నిల్వ లేకుండా చూసేందుకు చర్యలు తీసుకుంటాం. **- రామచంద్రారెడ్డి, ఈవోఆర్డీ - న్యూస్‌టుడే, వీరబల్లి**

పాలకులు మారుతున్నా... ఫలితం కనుమురుగు

రైల్వేకోడూరులో ప్రధాన సమస్యగా అపారిశుద్ధ్యం

– న్యూస్‌టుడే, రైల్వేకోడూరు

నియోజకవర్గ కేంద్రమైన రైల్వేకోడూరు అంటే ప్రజావసరాలకు ఢోకా లేని ప్రాంతం. పచ్చని పంటలు, నిండైన భూగర్భ జలాలు, నిరంతర విద్యుత్తు సరఫరాతో కనువిందు చేస్తుంటుంది. కానీ.. ఇల్లలి వర్షంపై సిరి మరకలా... పట్టణం మధ్యలో చెత్త నిల్వలు, మురుగు నీరు ప్రజలను వేధిస్తున్న సమస్యలుగా మారుతున్నాయి. దశాబ్దాలుగా ఈ సమస్యల పరిష్కారానికి నోచుకోని పాలకులు చర్యలు చేపట్టడంలో విఫలమవుతున్నారు. పాలకులు మారుతున్నా ఫలితం కనిపించడం లేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చెత్త నిర్వహణలో చిత్తశుద్ధి కనిపించట్లేదు.

వసతుల కొరత..

పట్టణంలోని రంగనాయకులపేట, అంకమ్మనగర్, చింతంనగర్, న్యూ కృష్ణానగర్, జగదంబల్లి, ధర్మాపురం, చిట్వేలిరోడ్డు, లక్ష్మీనగర్, హరిజనవాడ, అరుంధతివాడ, వడ్డిపల్లె ప్రాంతాల్లో ఎక్కడ చూసినా మురుగు కుప్పలే దర్శనమిస్తున్నాయి. నివాసాలు, దుకాణాల నుంచి వచ్చే చెత్త నిల్వలు పడేసేందుకు సామర్థ్యానికి కుప్పతొట్లు ఏర్పాటు చేయాలన్నా తగిన స్థలాలు లేవు. ప్రతి రోజూ చెత్త సేకరణ చేయాల్సిన పంచాయతీకి ఆ వెసులుబాటు కలగడం లేదు.

వానొస్తే అంతే..

ప్రస్తుతం వర్షాలు కురుస్తుండటంతో వీధులన్నీ మురుగుమయం తలపిస్తున్నాయి. కడప- చెన్నై జాతీయ రహదారికి అనుసంధానంగా ఇరవై ఏళ్ల కిందట నిర్మించిన డ్రైనేజీ కాలువలు సామర్థ్యాన్ని కోల్పోయి మురుగును రోడ్డుపైకి పంపుతున్నాయి. పట్టణానికి ఒక వైపు నదిలా మారుతోంది. దీంతో పాదచారులతో పాటు వాహనాలు కూడా తిరగలేని పరిస్థితి ఎదురవుతోంది. ఈ పరిస్థితులతో ప్రజలు సీజనల్ వ్యాధులు, జ్వరాల బారిన పడి ఆసుపత్రులకు తిరుగుతున్నారు.


పట్టణంలో చెత్త నిల్వలను తొలగిస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

మేజర్ గ్రామ పంచాయతీ	రైల్వేకోడూరు
వార్డులు	20
పారిశుద్ధ్య కార్మికులు	40
చెత్త తరలించే వాహనాలు	10


చిన్నపాటి వర్షం కురిస్తే టోల్‌గేట్ నుంచి బైపాస్ రోడ్డు వరకు మురుగు ఇలా...

జ్వరాల బారిన పడుతున్నాం

చిన్నపాటి వర్షం కురిసినా చెత్తంతా తడిసి దుర్వాసన వెదజల్లుతోంది. సరైన పారిశుద్ధ్య చర్యలు చేపట్టట్లేదు. దోమల ఉద్ధృతి పెరిగి జ్వరాల బారిన పడుతున్నాం. ఎవరికి చెప్పినా ఫలితం ఉండట్లేదు. మా ఇంట్లో అందరూ రోగాలబారిన పడి ఆసుపత్రులకు తిరుగుతున్నారు. **- ఎన్.లక్ష్మీనరసయ్య, వ్యాపారి, అంకమ్మనగర్**

చర్యలు చేపడుతున్నాం

పట్టణంలో ప్రతి రోజూ కార్మికులు ఊరంతా శుభ్రం చేస్తున్నారు. చాలా మంది రోడ్లపైనే చెత్తను పడేస్తున్నారు. వీధుల్లో కుప్పతొట్ల ఏర్పాటుకు స్థలాల యజమానులు అంగీకరించడం లేదు. ప్రధాన మురుగు కాలువ పునరుద్ధరణకు నిధుల మంజూరుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతాం. నిధులొస్తే పంచాయతీ తరఫున పనులు చేపడతాం. **- బుడిగి శివయ్య, సర్పంచి, రైల్వేకోడూరు**

పోలీసుల అదుపులో షికారీపాలెం ముఠా సభ్యుడు

ధర్మవరం: శ్రీ సత్యసాయి జిల్లా బత్తలపల్లి మండలం రామాపురం బస్టాప్ వద్ద జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన తుపాకీ కాల్పుల ఘటనపై బత్తలపల్లి పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. కాల్పుల ఘటనలో నిందితులను పట్టుకునేందుకు రెండు ప్రత్యేక పోలీసు బృందాలు ఏర్పాటు చేశారు. ఘటన అనంతరం పరారైన ఓ యువకుడిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా కీలక సమాచారం తెలిసింది. అతను అన్నమయ్య జిల్లా షికారీపాలెం చెందిన బంగారీగా గుర్తించారు. షికారీపాలెం చెందిన ఐదుగురు యువకులు ఓ ముఠాగా ఏర్పడి గుప్త నిధులు దొరికాయని, తమ వద్ద బంగారు నాణేలు ఉన్నాయని, వాటిని తక్కువ ధరకే ఇస్తామని ఎరవేసి, నకిలీ నాణేలు ఇచ్చి నగదు తీసుకుని మోసం చేస్తున్నట్లు విచారణలో తెలిసింది. పట్టుబడిన బంగారీ నుంచి వివరాలు రాబడుతున్నామని ధర్మవరం డీఎస్పీ టి.శ్రీనివాసులు పేర్కొన్నారు.

సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించొద్దు : కలెక్టర్

రాయచోటి, న్యూస్‌టుడే: అర్జీదారుల సమస్యలు పరిష్కరించడంలో అధికారులు నిర్లక్ష్యం వహించొద్దని కలెక్టర్ చామకూరి శ్రీధర్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆయన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అర్జీలు బియాండ్ ఎస్ఎల్ఏలోకి వెళ్లకుండా చూడాలన్నారు. ప్రతి అర్జీదారుడికి న్యాయం జరిగేలా క్షేత్ర స్థాయిలో పరిశీలించి నాణ్యమైన పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి కార్యాలయం ప్రజా సమస్యల పరిష్కార వేదికపై ప్రత్యేక దృష్టి సారిస్తోందన్నారు. లక్కిరెడ్డిపల్లె మండలం దప్పేపల్లి పోస్ట్ గల్లావాండ్లపల్లె గ్రామానికి చెందిన కవాలి రెడ్డెప్ప ఉపాధి హామీ జాబ్‌కార్డు కోసం కార్యాలయాల చుట్టూ తిరిగినా మంజూరుచేయలేదని కలెక్టర్‌కు అర్జీ సమర్పించారు. రాజంపేట పట్టణం రెడ్డివారివీధిలో ఉన్న చౌడేశ్వరీ దేవస్థానం కమిటీ అవకతవకలకు పాల్పడిందని విచారణ జరిపించి న్యాయం చేయాలని ప్రజలు విన్నవించారు. సుండుపల్లి మండలం చెన్నంశెట్టిపల్లి గ్రామానికి చెందిన నారాయణ అనే రైతు తన పొలానికి వెళ్లేందుకు దారి లేకుండా కొందరు ఇబ్బంది పెడుతున్నారని విచారించి న్యాయం చేయాలని కోరారు. జేసీ ఆదర్శ్ రాజేంద్రన్, ఆర్డీవో రంగస్వామి, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

38 అర్జీల అందజేత

రాయచోటి: జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ వి.విద్యాసాగర్‌నాయుడు ఆధ్వర్యంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 38 మంది అర్జీదారుల నుంచి ఆయన వినతులు స్వీకరించారు. పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

ప్రతిభా పరీక్షలు... భవితకు సోపానాలు


వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు


విజేతలకు బహుమతులు అందజేస్తున్న కరస్పాండెంట్ నరసింహారెడ్డి, ప్రిన్సిపల్ రామకృష్ణారెడ్డి

రైల్వేకోడూరు పట్టణంలోని విక్టరీ ఉన్నత పాఠశాలలో సోమవారం 'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. అంతర్జాలం వినియోగంతో కలిగే లాభాలు, నష్టాలు - విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం' అంశంపై వ్యాసరచన పోటీలు జరిగాయి. 8, 9, 10వ తరగతుల విద్యార్థులు హాజరయ్యారు. వారిలో ఎనిమిదో తరగతి నుంచి బి.కార్తికారెడ్డి, తొమ్మిదో తరగతి నుంచి కె.హరిసిద్ధార్థ్, పదోతరగతికి చెందిన పి.హేమనందిని విజేతలుగా నిలిచారు. వీరికి కరస్పాండెంట్ నరసింహారెడ్డి విజేతలకు బహుమతులు అందజేశారు. ప్రిన్సిపల్ రామకృష్ణారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. **- న్యూస్‌టుడే, రైల్వేకోడూరు**

సుద్దరాయి గనుల భూముల స్వాహాపై ఫిర్యాదు

రైల్వేకోడూరు, న్యూస్‌టుడే: మండల పరిధిలోని వీవీ కండ్రిక పంచాయతీలో తమకు లీజుకు కేటాయించిన సుద్దరాయి గనుల భూములను కిందరు ఆక్రమించేశారని.. విచారించి చర్యలు చేపట్టాలంటూ ఆ భూములను లీజుకు తీసుకున్న గద్దలరేవుపల్లె కృష్ణంరాజు తహసీల్దారు మోహబూబ్ చాంద్‌కు ఫిర్యాదు చేశారు. రెవెన్యూ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆయన అధికారులకు వివరించారు. కొందరు అక్రమార్కులు పేదలకు కేటాయించిన భూములను స్వాహా చేసి గనులే లేకుండా చేస్తున్నారన్నారు. ఈ వ్యవహారాలకు సంబంధించిన పూర్తి వివరాలను అందజేస్తే ఉన్నతాధికారులకు వివరించి తగిన చర్యలు చేపడతామని తహసీల్దారు చెప్పారు.

ఏపీఐఐసీ భూముల అక్రమ రిజిస్ట్రేషన్లపై విచారణకు డిమాండు

రాజంపేట, రాజంపేట గ్రామీణ: రాజంపేట మండలం తాళ్లపాక, మన్నూరు, బోయనపల్లి పరిధిలోని ఏపీఐఐసీ భూములను అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్న వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపించాలని బోయనపల్లికి చెందిన తెదేపా నాయకుడు సుధాకర్‌బాబు రాజంపేట సబ్ కలెక్టర్ నైదియా దేవిని సోమవారం కలిసి ఫిర్యాదు చేశారు. ఏపీఐఐసీ భూముల పేరుతో సాగిన భూదందాపై 'ఈనాడు' ప్రధాన సంచికలో సోమవారం 'పంచేశారు.. భోంచేశారు' అనే శీర్షికతో కథనం ప్రచురితమైంది. తాళ్లపాక, కారంపల్లి పంచాయతీ భూములు జాతీయ రహదారికి సమీపంలో ఉండడంతో ఈ భూములకు మంచి డిమాండు ఉందని.. ప్రభుత్వ భూములు ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ అక్రమ వ్యవహారంలో పాలు పంచుకున్న బాధ్యులపై చర్యలు తీసుకోవాలని టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.వేణుగోపాల్, తెదేపా మండలశాఖ అధ్యక్షుడు సుబ్బనరసయ్య నాయుడులు సబ్‌కలెక్టర్ కార్యాలయ అధికారిని కలిసి ఫిర్యాదు చేశారు. వారి వెంట పార్టీ నాయకులు రెడ్డయ్యనాయుడు, పాండురాజు పాల్గొన్నారు.


రాజంపేట సబ్ కలెక్టర్ నైదియాదేవికి ఫిర్యాదు చేస్తున్న తెదేపా నాయకుడు సుధాకర్‌బాబు

ప్రజాసమస్యలపై దృష్టి సారించాలని వినతి

రాజంపేట, న్యూస్‌టుడే: ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై అధికారులు దృష్టి సారిస్తే ఆ సమస్యలు పరిష్కారమవుతాయని సబ్‌కలెక్టర్ నైదియాదేవి అన్నారు. రాజంపేట డివిజన్‌లోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ఆమె అర్జీలు స్వీకరించారు. తమ భూములను ఆక్రమించారని కొందరు. . తమ భూములు ఎక్కడున్నాయో తెలపాలని మరి కొందరు ఆమెకు మొరపెట్టుకున్నారు. మిలటరీ కోటా కింద భూమి ఇవ్వాలని కోరుతున్నా కింది స్థాయి అధికారులు ఇవ్వడంలేదని విశ్రాంత మిలటరీ అధికారి రమేష్ విన్నవించారు.

పుల్లంపేట: ప్రతి నిరుపేద గిరిజన కుటుంబానికి మూడెకరాల బంజరు భూమి ఇవ్వాలని జిల్లా బీకేఎంయూ అధ్యక్షుడు మండుగోల మణి కోరారు. పుల్లంపేట తహసీల్దారు కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం తహసీల్దారు అరవింద్‌కిశోర్‌కు వినతిపత్రం అందించారు. రంగంపల్లె పంచాయతీ ఆర్.రాచపల్లె ఎస్టీ కాలనీ వాసులకు గ్రామం పక్కనే ఉన్న సర్వే నెంబర్ 585లో వంద ఎకరాల బంజరు భూమి ఉందని ఆ భూమిని ఇవ్వాలన్నారు. జయరామయ్య, వెంకటరమణ, కృష్ణవేణి, రమణయ్య, శివ, నరసింహులు, ఎస్టీకాలనీ వాసులు పాల్గొన్నారు.

వీరబల్లి: బడుగు బలహీన వర్గాల వారికి ప్రాధాన్యం ఇచ్చి వారి సమస్యలు తీర్చాలని మండల జనసేన పార్టీ అధ్యక్షుడు పీరుగారి జయరామయ్య, పార్టీ నాయకులు కోరారు. మండలంలోని పలు శాఖల మండల అధికారులకు వారు వినతి పత్రాలు అందజేశారు. తహసీల్దారు శ్రావణి, ఎంపీడీవో నూర్జాహన్, ఎంఈవో రామకృష్ణుడిని కలిసి విన్నవించారు.


పుల్లంపేట తహసీల్దారుకు వినతిపత్రం అందిస్తున్న బీకేఎంయూ నాయకులు

విద్యార్థుల హాజరుశాతం పెంచాలి

పుల్లంపేట: మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలో విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచాలని ఎంఈవోలు చక్రధర్‌రాజు, నాగతిరుమలరావు పేర్కొన్నారు. మండల పరిధిలోని సీతారాంపేట ప్రాథమిక పాఠశాలను సోమవారం వారు తనిఖీ చేశారు. దస్త్రాలు, విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. సీఆర్పీ పాల్గొన్నారు.


విద్యార్థుల విద్యా సామర్థ్యాన్ని పరిశీలిస్తున్న ఎంఈవోలు

దళితుల భూములకు రక్షణ కల్పించండి

చిట్వేలి(పుల్లంపేట), న్యూస్‌టుడే: దళిత భూములకు రక్షణ కల్పించాలని రైల్వేకోడూరు సీపీఐ నాయకులు జ్యోతి చిన్నయ్య, రెడ్డెయ్యలు డిమాండు చేశారు. రాజంపేట సబ్‌కలెక్టర్ నైదియాదేవిని సోమవారం వారు కలిసి దేవమాచపల్లె ఎస్సీ, ఎస్టీలకు కేటాయించిన ప్రభుత్వ భూములు కబ్జా కాకుండా దళితులకే న్యాయం జరిగేలా చూడాలని వినతిపత్రం అందించారు. సీపీఐ నాయకులు సుధాకర్, గంగాధర్, పెంచలయ్య, రమణ, యానాది పాల్గొన్నారు.

ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి మృతి

సుండుపల్లి: భాగంపల్లి పంచాయతీ కురవపల్లెకు చెందిన సి.గోపాల్ (43) తిరుపతిలోని ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై శ్రీనివాసులు సోమవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. ఈ నెల తొమ్మిదో తేదీ తీసుకున్న అప్పులు తీర్చాలని అదే గ్రామానికి చెందిన నలుగురు ఒత్తిడి తెస్తున్నారని గోపాల్ తమకు ఫిర్యాదు చేశారన్నారు. తనకు ఏదైనా జరిగితే వారే బాధ్యులను అందులో పేర్కొనగా కేసు నమోదు చేశామన్నారు. అనంతరం గోపాల్‌ను రుణదాతలు బెదిరించడంతో గ్రామ సమీపంలోని పొలానికి వెళ్లి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. అప్పటి నుంచి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి సోమవారం మృతి చెందారని ఆయన భార్య ఫిర్యాదు చేశారని ఎస్సై వివరించారు.


గోపాల్ (పాత చిత్రం)

పోలీసుస్టేషన్‌లో గుండెపోటుతో వ్యక్తి...

సంబేపల్లె(రాయచోటి): సంబేపల్లె పోలీసు స్టేషన్‌లో ఓ వ్యక్తి గుండెపోటుతో సోమవారం మృతి చెందారు. దుద్యాలకు చెందిన అంజనమ్మ అనే మహిళ తన సమీప బంధువులు బంగారు తీసుకొని ఇవ్వడం లేదని పోలీసులకు ఫిర్యాదు చేశారు. దాంతో సంబేపల్లె పోలీసులు కొండవాండ్లపల్లెకు చెందిన దేవరాజ్ (55) అనే వ్యక్తిని స్టేషన్‌కు పిలిపించి విచారించారు. ఆ సమయంలో దేవరాజ్ ఒక్క సారిగా కుర్చీలోనే కుప్పకూలిపోయారు. వెంటనే 108లో రాయచోటిలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే దేవరాజ్ మృతి చెందాడని వైద్యులు తెలిపారు. స్టేషన్ వద్దకు వెళ్లిన బంధువులు దేవరాజ్ మృతికి కారకులు ఎవరంటూ ఆందోళనకు దిగే ప్రయత్నం చేయగా పోలీసులు అక్కడి సీసీ పుటేజీలను చూపించడంతో పరిస్థితి సద్దుమణిగింది. విషయం తెలిసిన వెంటనే డీఎస్పీ కృష్ణమోహన్ సంబేపల్లెకు చేరుకుని సంఘటనపై ఆరా తీశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

లక్కిరెడ్డిపల్లె, న్యూస్‌టుడే: స్థానిక మూడు రోడ్ల కూడలి వద్ద ద్విచక్ర వాహనం ప్రమాదవశాత్తు అదుపుతప్పి కిందపడి ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. మండల పరిధిలోని దేవలంపల్లెకు చెందిన రామచంద్ర వ్యక్తిగత పనుల నిమిత్తం సోమవారం లక్కిరెడ్డిపల్లె వెళ్లి తిరిగి ఇంటికి వెళ్తుండగా మార్గ మధ్యలో అదుపు తప్పి కింద పడటంతో ప్రమాదం జరిగింది. హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యుడు సలీం క్షతగాత్రుడిని ఆసుపత్రికి తరలించారు.

స్కూటర్‌లో ఉంచిన బంగారు మాయం

రాజంపేట, న్యూస్‌టుడే: బ్యాంకు నుంచి బంగారు తీసుకుని స్కూటర్‌లో పెట్టుకుని ఇంటికి వెళ్లి చూసుకుంటే అందులో బంగారు లేకపోవడంతో బాధితుడు శ్రీనివాసులు ఫిర్యాదు చేసినట్లు పట్టణ ఎస్ఐ లక్ష్మీప్రసాద్‌రెడ్డి తెలిపారు. బాధితుడు ఓ బ్యాంకు నుంచి 12 తులాల బంగారాన్ని తీసుకుని తన ద్విచక్రవాహనంలో పెట్టుకుని నలందానగర్‌కి వెళుతున్న సమయంలో ఈ ఘటన చోటు చేసుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన చెప్పారు.

సొంత నిధులతో రహదారికి మరమ్మతులు

సుండుపల్లి: పెద్దబలిజపల్లి నుంచి వ్యవసాయ పొలాలకు వెళ్లే రహదారి ఇటీవల వర్షాలకు కోతకు గురైంది. దీంతో పొలాల నుంచి పంటను తెచ్చుకునేందుకు రాకపోకలకు రైతులు ఇబ్బందులు పడుతున్నారు. వారంతా ఎవరో వచ్చి ఏదో వస్తారని వేచి చూడకుండా.. గ్రామస్థులంతా కలిసి చందాలు వేసుకుని 20 ట్రాక్టర్లతో మట్టి తోలించుకుని మరమ్మతులు చేసుకున్నారు.


పొలాలకు వెళ్లే రహదారికి మరమ్మతులు చేసుకుంటున్న స్థానికులు

ఘనంగా పూజలు

సుండుపల్లి, న్యూస్‌టుడే: స్థానిక విరూపాక్ష-చెన్నకేశవ ఆలయాల్లో సోమవారం స్వామివార్లకు భక్తులు అభిషేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అయ్యప్ప, గోవింద మాలాధారుల ఆధ్వర్యంలో అన్న వితరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. వచ్చే ఏడాది జనవరి నాలుగో తేదీ వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందని మాలధారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.


అలంకరణలో విరూపాక్షస్వామి

విద్యార్థినుల ప్రతిభ

రాజంపేట: ప్రొద్దుటూరు ఎస్ఆర్ఐటీ కళాశాలలో టెక్నో హూలిక్స్-2కే24 పేరిట నిర్వహిస్తున్న సదస్సులో రాజంపేట అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థినులు సత్తా చాటారు. పేపర్ ప్రజెంటేషన్‌లో బీటెక్ సివిల్ ఇంజినీరింగ్ విద్యార్థినులు వైష్ణవి, సువేష్మ ఉత్తమ ప్రతిభ కనబరిచి ద్వితీయ స్థానంలో నిలిచినట్లు ఏఐటీఎస్ వైస్ ఛైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్ఎంవీ నారాయణ తెలిపారు.

నాణ్యమైన విద్య అందించాలి



నిరసన తెలుపుతున్న పీడీఎస్‌యూ నాయకులు

రాయచోటి గ్రామీణ, న్యూస్‌టుడే: పేద విద్యార్థులకు నాణ్యమైన ఉచిత విద్య అందించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంకన్న డిమాండు చేశారు. రాయచోటిలోని ఓ ప్రైవేటు కళాశాలలో పీడీఎస్‌యూ సోమవారం ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. పీడీఎస్‌యూ ఆవిర్భవించి యాభై ఏళ్లు పూర్తయిన సందర్భంగా త్వరలో హైదరాబాద్, విజయవాడల్లో జరిగే అర్ధ శతాబ్దపు మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. పీడీఎస్‌యూ నాయకులు ప్రసాద్, ముబారక్, రామాంజులు, కిరణ్, అరుణ్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపిక

ఎగువగొట్టివీడు(గాలివీడు): ఎగువగొట్టివీడు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు ఎంపికయ్యారని వ్యాయామ ఉపాధ్యాయుడు శ్రీనివాసులు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో సోమవారం బోయనపల్లెలోని వేంకటేశ్వర ఎయిడెడ్ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. అందులో పాల్గొన్న అండర్-17 ఖోఖో బాలికల విభాగంలో కె.రెడ్డిప్రియ, అండర్-14 బాలుర విభాగంలో పి.సునీల్‌కుమార్‌నాయుడు ఎంపికయ్యారని తెలిపారు. వారిని ప్రధానోపాధ్యాయుడు వెంకట్రామిరెడ్డి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు.


రెడ్డిప్రియ, సునీల్‌కుమార్ నాయుడు

సుండుపల్లి.. సమస్యలతో తల్లడిల్లి

అభివృద్ధికి దూరంగా మండల కేంద్రం

సుండుపల్లి, న్యూస్‌టుడే: మండల కేంద్రమైన సుండుపల్లి అభివృద్ధికి ఆమడ దూరంలో ఉంది. నలుదిశలా విస్తరిస్తున్నా పుష్కర కాలంగా నిధుల కొరత.. ప్రాధాన్యత లేమితో సమ్యలకు నిలయంగా మారింది. దీంతో మండల వాసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రధానంగా చాలా వీధుల్లో సీసీ రహదారులు లేవు. ఎక్కడ చూసిన అపారిశుద్ధ్యమే దర్శనమిస్తోంది.

● మారుతినగర్, శివాజినగర్, సాయన్నగారిపల్లిలోని నివాసాల నుంచి మురుగు రోడ్డుపైకి పారుతోంది. ప్రధాన రహదారి పక్కనే ఉన్న కాలువల్లోకి మురుగు వెళ్లేందుకు అవకాశం లేక ఈ పరిస్థితి నెలకొంది. యానాది కాలనీలో సిమెంటు రహదారులు లేక స్థానికులు గుంతలమయమైన మార్గంలోనే రాకపోకలు సాగిస్తున్నారు. ఆనందనగర్‌లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. కృష్ణానగర్‌లో పోస్టాఫీసుకు వెళ్లే వీధిలో అసంపూర్తి నిర్మాణాలున్నాయి.

● రాయచోటి ప్రధాన రహదారి నుంచి కేఎం ఆడిటోరియం వీధి, అరెమ్మ ఆలయ వీధి, బేతానియ కృపామందిరం వీధి, అగ్రహారం బలిజపల్లి మార్గంలో కల్యాణ మండపం వీధితో పాటు పలు ప్రాంతాలలో సిమెంటు రహదారులు, మురుగునీటి కాలువలు లేక స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. కూటమి ప్రభుత్వమైన మండల కేంద్ర సమస్యలు పరిష్కరించాలని వారు కోరుతున్నారు.


సుండుపల్లిలోని ఓ వీధిలో కాలువలు లేకపోవడంతో మురుగు నిల్వలు